


epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

సంపుటి : 18 సంచిక : 382 | 29-03-2026 ఆదివారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 12 వెల : రూ.1.00

## అత్యవసరంగా ల్యాండ్ అయిన ఇండిగో

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

విశాఖపట్నం నుంచి ఢిల్లీకి ప్రయాణిస్తున్న ఇండిగో విమానం శనివారం ఉదయం ఢిల్లీ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయింది. విమానం గాలిలో ఉండగా ఒక ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తినట్లు పైలట్లు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన పైలట్లు ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో రన్‌వే 28 వద్ద అధికారులు



పూర్తిస్థాయి ఎమర్జెన్సీ ప్రకటించారు. విమానాశ్రయం వద్ద ముందు జాగ్రత్తగా అగ్నిమాపక యంత్రాలు, వైద్య బృందాలను సిద్ధంగా ఉంచారు. మొత్తం 160 మంది ప్రయాణికులతో ఉన్న ఈ విమానం ఉదయం 10:59 గంటలకు సురక్షితంగా ల్యాండ్ అవ్వడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణికులందరూ క్షేమంగా ఉన్నారని, వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎయిర్‌లైన్ వర్గాలు తెలిపాయి.

# మూసీని అడ్డుకుంటే శివతాండవమే

- ప్రజలే అడ్డుకున్న వారికి బుద్ధి చెబుతారు
- మూసీ కాలుష్యాన్ని నిర్మూలనే మా లక్ష్యం
- దేవుడు మాకిచ్చిన అవకాశంగా చూస్తున్నాం
- మంచిరేవులలో ఓంకారేశ్వరాలయ శంకుస్థాపనలో సిఎం రేవంత్

రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం సరికాదని, ఆరు నూరైనా.. అక్కడి సూర్యుడు ఇక్కడ ఉదయించినా ఈ ప్రాజెక్టు ఆగదని తేల్చి చెప్పారు. శనివారం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచి రేవుల వద్ద ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు

వార్త 2లో








## బిఆర్ఎస్ ఆడే పోటీలను నిర్వహించలేం

మత్తు వదిలించుకోవడానికే మైదానానికి రమ్మన్నాం వారు ఆడలేమంటే..వారి ఆటలు పెట్టలేం కదా క్రీడాపోటీల్లో పాల్గొనడం లేదన్న కెటిఆర్ వ్యాఖ్యలపై వాకిటి కౌంటర్



2

తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడా పోటీల్లో తాము పాల్గొనబోమంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి వాకిటి శ్రీహరి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. మత్తు వదిలించుకోవడానికే మైదానంలోకి రమ్మంటున్నామని ఎద్దేవా చేశారు. మైదానంలోకి తాము రామంటూ కేటీఆర్ అంటుంటే ఏం చేయగలమని అన్నారు.



2

## మారనున్న ఆస్కార్ వేడుకల వేదిక

## కంచె చేను మేసినట్లుగా ఉంది

2

- మంత్రి కంపెనీ అక్రమాలను పట్టించుకోరా
- నగరం నడిబొడ్డున అక్రమ మైనింగ్ జరుగుతోంది
- మైనింగ్ వ్యవహారంలో హౌజ్ కమిటీకి హరీష్ రావు డిమాండ్
- హరీష్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క





2

## బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దు


బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ట్విట్టర్ వేదికగా యువతను హెచ్చరించరు. ఐపీఎల్ సీజన్ మొదలవుతున్న తరుణంలో క్రికెట్‌ను కేవలం క్రీడగా ఆస్వాదించాలని, బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు.




## చిన్నారులకు పౌష్టికాహారం తొలిముద్ద

- పథకాన్ని ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి
- అంగన్‌వాడీలకు సొంత భవనాలు నిర్మిస్తామని హామీ
- అంగన్‌వాడీలకు సెల్‌ఫోన్లు అందచేత

వార్త 2లో



2

## ఇరాన్ నేత మొజ్తబా ఖమేనీ కూడా మరణించే ఉంటాడు

# బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దు

### ఐపిఎల్ ప్రారంభంతో యువతకు సిపి సజ్జన్నార్ హెచ్చరిక

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ట్విట్టర్ వేదికగా యువతను హెచ్చరించరు. ఐపీఎల్ సీజన్ మొదలవుతున్న తరుణంలో క్రికెట్‌ను కేవలం క్రీడగా ఆస్వాదించాలని, బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. వందలాది యాప్‌లను ప్రభుత్వం నిషేధించినప్పటికీ, ఇప్పుడు టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికగా ఈ దందా కొత్త రూపం దాల్చింది. కేవలం డబ్బు కోసం ఇటువంటి ప్రమాదకరమైన యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్ మాత్రమే కాకుండా ఫామ్ హౌస్‌లు, రహస్య ప్రాంతాల్లో సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లపై మా ప్రత్యేక నిఘా ఉంటుందని సజ్జన్నార్ హెచ్చరించారు. బెట్టింగ్ వల్ల అప్పులపాలై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి తెచ్చుకోవద్దు. మీ పరిసరాల్లో ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా మా వాట్సాప్ నంబర్ 94906 16555 కు సమాచారం ఇవ్వండని శనివారం వీడియో షేర్ చేశారు. క్రికెట్ అభిమానులకు ఐపీఎస్-2026 పండుగ మొదలైంది. శనివారం రాత్రి 07:30 గంటలకు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనున్నాయి. ఐపీఎల్ 19వ సీజన్ మే 31 వరకు నిర్వహించనున్నారు. ఈ లీగ్‌లో మొత్తంగా 10 జట్లు తలపడనుండగా.. 74 మ్యాచ్‌లు జరుగనున్నాయి. అయితే, ఐపీఎల్ అంటే గుర్తొచ్చే మరో విషయం బెట్టింగ్. ఈ సమయంలో బెట్టింగ్ రాయుళ్లు రెచ్చిపోతుంటారు. అమయాక యువతను లక్ష్యంగా చేసుకుని కోట్లు దండుకుంటుంటారు. ఐపీఎల్ వేళ వందల కోట్ల రూపాయలు చేతులు మారుతుంటాయి. ఈ సందర్భంగా యువతకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ కీలక సూచనలు చేశారు. బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. బెట్టింగ్ వల్ల అప్పులు పెరిగి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దాని జోలికి వెళ్లకుండా క్రికెట్‌ను కేవలం క్రీడగా మాత్రమే ఆస్వాదించాలని యువతకు పిలుపునిచ్చారు.

# బిఆర్ఎస్ ఆడే పోటీలను నిర్వహించలేం

### మత్తు వదిలించుకోవడానికే మైదానానికి రమ్మన్నాం

### వారు ఆడలేమంటే..వారి ఆటలు పెట్టలేం కదా

### క్రీడాపోటీల్లో పాల్గొనడం లేదన్న కెటిఆర్ వ్యాఖ్యలపై వాకిటి కౌంటర్

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

: తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడా పోటీల్లో తాము పాల్గొనబోమంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి వాకిటి శ్రీహరి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. మత్తు వదిలించుకోవడానికే మైదానంలోకి రమ్మంటున్నామని ఎద్దేవా చేశారు. మైదానంలోకి తాము రామంటూ కేటీఆర్ అంటుంటే ఏం చేయగలమని అన్నారు. 'మావి వేరే గేమ్స్, కేటీఆర్‌వి మరో రకమైన గేమ్స్' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బీఆర్ఎస్ వాళ్లు ఆడే గేమ్స్ పెట్టడం సాధ్యం కాదు కదా? అంటూ మంత్రి వాకిటి శ్రీహరి చురకలు అంటించారు . తాము ఫిట్ తెలంగాణ కోసం ప్రయత్నం చేస్తున్నామని.. ఆరోగ్య తెలంగాణ ఉండాలని సీఎం ఆలోచన చేస్తున్నారని మంత్రి తెలిపారు. ప్రజాప్రతినిధులు క్రీడలు ఆడడం వల్ల విద్యార్థులకు మార్గదర్శకంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలతో పిల్లలకు డ్రగ్స్ వంటి ఆలోచనలు రాకుండా ఆటల వైపు మళ్లుతారని వాకిటి పేర్కొన్నారు. కాగా, నేటి నుంచి రెండ్రోజులపాటు జరిగే లెజిస్లేచర్ స్పోర్ట్స్ మీట్-2026లో తమ పార్టీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు పాల్గొనరంటూ ఎమ్మెల్యే కేటీఆర్ ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజా సమస్యలపై చర్చించకుండా క్రీడా పోటీలు అవసరమా? అంటూ ప్రశ్నించారు. శాసనసభ సమయం వృథా చేయడం తగదని.. కనీసం ఇంకో 10 రోజులు సమావేశాలను కొనసాగించాలని అన్నారు. దీనిపై మంత్రి వాకిటి శ్రీహరి స్పందిస్తూ పైవిధంగా కౌంటర్ ఇచ్చారు.

# కంచె చేను మేసినట్లుగా ఉంది

### మంత్రి కంపెనీ అక్రమాలను పట్టించుకోరా

### నగరం నడిబొడ్డున అక్రమ మైనింగ్ జరుగుతోంది

### మైనింగ్ వ్యవహారంలో హౌజ్ కమిటీకి హరీష్ రావు డిమాండ్

### హరీష్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

:అక్రమ మైనింగ్ ముఖ్యంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ మైనింగ్ వ్యవహారంపై అసెంబ్లీలో దుమారం చెలరేగింది. అక్మ మైనింగ్‌పై చర్యలు తీసుకోవడం లేదంటూ బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. అసెంబ్లీలో మైనింగ్ అంశంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'కంచె చేను మేసినట్లు... రక్షకుడే భక్షకుడిలా మారినట్లు అక్రమ మైనింగ్ జరుగుతోంది' అని విమర్శించారు. నగరం నడిబొడ్డున అక్రమ మైనింగ్ జరుగుతోందని.. రాఘవ కన్స్ట్రక్షన్స్ నడుపుతున్న క్రషర్లకు ఎలాంటి అనుమతులు లేవని ఆయన ఆరోపించారు. క్రషర్ నడపాలంటే 8 రకాల అనుమతులు కావాలని.. కానీ నిబంధనలు పాటించకుండా నడుపుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి కోట్ల రూపాయలు గండిపడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. మైనింగ్ శాఖ ఇప్పటికే షోకాజ్ నోటీసులు, డిమాండ్ నోటీసులు ఇచ్చినా చర్యలు జరగడం లేదని తెలిపారు. అనుమతులు లేని క్రషర్‌ను మూసివేయాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు మైనింగ్ శాఖ లేఖ రాసినా ఎలాంటి చర్యలు లేవని వ్యాఖ్యలు చేశారు. ఒక క్రషర్ కంపెనీ వల్ల కాలుష్యం పెరుగుతోందని ట్వీట్ పెట్టానని.. ఈ ట్వీట్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ తీవ్రంగా స్పందించారని సభలో హరీశ్ తెలిపారు. 'విచారణ జరిపిస్తారని అన్నారు మంచిదే. పొంగులేటి మంత్రిగా ఉన్నప్పుడు విచారణ జరపడం పద్ధతి కాదు. మంత్రి పదవికి పొంగులేటి రాజీనామా చేసిన తర్వాత విచారణ జరిపించాలి' అని హరీష్ రావు డిమాండ్ చేశారు. 'నాకు పొంగులేటి మంచి మిత్రుడు. ఆయన, నేను కలిసి పనిచేశాం. నాకు వ్యక్తిగత ఉద్దేశాలు లేవు. గతంలో మేం తప్పులు చేశాం కాబట్టి మీరు తప్పులు చేస్తామనడం మంచిది కాదు. ఓబుళాపురం మైన్స్‌పై కూడా సభలో చర్చ జరిగింది. ఓబుళాపురం మైన్స్ విషయంలో హౌస్ కమిటీ వేశారు. ఆరోపణలు చేసిన నాగం జనార్ధన్ రెడ్డిని హౌస్ కమిటీకి హెడ్‌గా పెట్టారు. తప్పు చేయకపోతే హౌస్ కమిటీ వేయండి. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించండి' అంటూ హరీశ్ రావు పట్టుబట్టారు. హరీశ్ రావు వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు సీరియస్ అయ్యారు. హరీశ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. 'విచారణ కోరారు... జరిపిస్తామని అన్నాం.. ఇంకా ఏంటి. మంత్రి పేరు ఎలా తీసుకుంటారు. హరీశ్ రావు చేసిన ఆరోపణలు వెనక్కి తీసుకోవాలి. మంత్రి ఎందుకు రాజీనామా చేయాలి. అడ్డగోలు ఆరోపణలు సరికాదు. హరీశ్ మాటలు రికార్డ్ నుంచి తొలగించాలి' అని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. హరీష్ రావు అసలు ఉద్దేశం ఏంటో చెప్పాలని మంత్రి సీతక్క అన్నారు. కేసీఆర్ హయాంలో 40 క్రషర్లకు పర్మిషన్ ఇచ్చారని గుర్తుచేశారు. కావాలని మంత్రి పొంగులేటిని టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు. ఉద్దేశపూర్వకంగా మంత్రుల పేర్లు తీస్తున్నారన్నారు. పదేళ్ల అక్రమాలపై విచారణ చేయాలని మంత్రి సీతక్క అన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. పదేళ్లు జరిగిన మైనింగ్‌పై విచారణ జరిపిద్దామన్నారు. పదేళ్ల అడ్డగోలుగా ఇసుక దోపిడి చేశారని ఆరోపించారు. తప్పు చేసిన వారిపై తప్పకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి తెలిపారు. హరీశ్ రావు కోరినట్లు హౌస్ కమిటీ అడగడం సరికాదని.. విచారణ జరిపి తామే చర్యలు తీసుకుంటామని మంత్రి వివేక్ స్పష్టం చేశారు. సాండ్ మాఫియాలో దళితులను కొట్టినప్పుడు ఎందుకు హౌస్ కమిటీ వేయలేదని వివేక్ ప్రశ్నించారు. వెంటనే మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. క్రషన్ కంపెనీకి సంబంధించి చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారని.. కానీ బీఆర్ఎస్ వెనక్కి పోతోందన్నారు. మంత్రి శ్రీనివాస్ రెడ్డిపై వ్యక్తిగతంగా మాట్లాడుతు న్నారని మండిపడ్డారు.

# మూసీని అడ్డుకుంటే శివతాండవమే

### ప్రజలే అడ్డుకున్న వారికి బుద్ధి చెబుతారు

### మూసీ కాలుష్యాన్ని నిర్మూలనే మా లక్ష్యం

### దేవుడు మాకిచ్చిన అవకాశంగా చూస్తున్నాం

### మంచిరేవులలో ఓంకారేశ్వరాలయ శంకుస్థాపనలో సిఎం రేవంత్





రంగారెడ్డి, అక్షరకలం ప్రతినిధి

రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం సరికాదని, ఆరు నూరైనా.. అక్కడి సూర్యుడు ఇక్కడ ఉదయించినా ఈ ప్రాజెక్టు ఆగదని తేల్చి చెప్పారు. శనివారం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవుల వద్ద ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అలాగే చేవెళ్లలోని ఎంకేపల్లి వద్ద ఆధునిక గోశాలకూ ఆయన శంకుస్థాపన చేశారు. కుటుంబసమేతంగా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. మంచిరేవుల ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం ఏ సంస్కృతి అంటూ ప్రశ్నించారు.. హైదరాబాద్ నగరం మత సామరస్యానికి వేదిక. మూసీ పరీవాహకంలో చారిత్రక శివాలయాన్ని పునఃనిర్మించాలని ఈశ్వరుని ఆశీర్వాదంతో పనులు మొదలుపెట్టాం. దీనిపై పెడార్థాలు తీసి విమర్శించే వారిపై ప్రజలే శివతాండవం చేస్తారని హెచ్చరించారు. ఆరు నూరైనా ఈ ప్రాజెక్టు ఆగదు.. ఇది శివదీక్ష. రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి ఈ ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. ఇది ఓట్ల కోసం.. నోట్ల కోసం చేస్తున్న పని కాదు. ఇది చరిత్రలో దేవుడి ఇచ్చిన గొప్ప అవకాశం.. ప్రజల పట్ల మాకున్న చిత్తశుద్ధి. ప్రజలే మాకు దేవుళ్లు. వారి ఆకాంక్షల మేరకే చేస్తున్నాం. చరిత్రాత్మక మందిరాన్ని నిర్మించుకోవడం ఒక చారిత్రక సందర్భం. ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఈ పని జరుగుతోందని అనుకోవట్లేదని సిఎం అన్నారు. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదంటారు. ఇది దైవేచ్ఛతో జరుగుతున్న కార్యక్రమం. 8 ఎకరాల్లో రూ.700కోట్లతో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నాం. ఈ ప్రాంతానికి 1400 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ చరిత్ర కనుమరుగు కాకుండా భవిష్యత్తు తరాలకు అందించాలన్నదే మా ప్రభుత్వ ఆలోచన. మూసీ నది పునరుజ్జీవనం చేయాలని చాలా మంది ప్రయత్నించారు. కారణాలు ఏవైనా ఆ ప్రయత్నాలు ముందుకు సాగలేదు. ఆ అవకాశం మనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నా అని వివరించారు.. విమర్శలు వచ్చినా, అడ్డంకులు సృష్టించినా దేవుడే వాటిని తొలగిస్తాడు. తెలంగాణ పౌరులకు నా విజ్ఞప్తి ఒక్కటే. చరిత్రను గమనిస్తే నది పరీవాహకంలోనే నాగరికత అభివృద్ధి చెందింది. సముద్ర పరీవాహకంలో వ్యాపారం, ఆర్థిక అభివృద్ధి జరిగింది. మూసా, ఈసా నదులు ఉన్నా సరైన విధంగా మనం ఉపయోగించుకోలేదు. మానవ తప్పిదాలతోనే మూసీ కాలుష్య కారకంగా మారిందని దానిని మార్చాల్సిందేనని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, సిఎస్ రామకృష్ణారావు,డిజిపి శివధర్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే పాల్గొన్నారు.

# ఇరాన్ నేత మొజ్తబా ఖమేనీ కూడా మరణించే ఉంటాడు

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

వాషింగ్టన్, అక్షరకలం ప్రతినిధి

ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ మరణించి ఉండొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా సైనిక దాడులు ఇరాన్ అగ్ర నాయకత్వాన్ని తుడిచిపెట్టాయని, దీంతో ఆ దేశంలో నాయకత్వం లేకుండా పోయిందని ట్రంప్ చెప్పుకొచ్చారు. అమెరికాలోని మయామిలో జరిగిన ఫ్యూచర్ ఇన్వెస్ట్‌మెంట్ ఇనిషియేటివ్ ప్రయారిటీ సమ్మిట్‌లో ప్రసంగిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా కార్యకలాపాల వల్ల ఇరాన్ బలహీనపడిందని ట్రంప్ ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు. ఇరాన్ సైనిక సామర్థ్యాలను నిర్మూలించడంలో అమెరికా దళాలు అంచనాలకు మించి పనిచేశాయని ఆయన అన్నారు. 'ఇరాన్ నౌకాదళం అంతమైపోయింది. అదంతా అఖాతపు అడుగున మునిగిపోయింది.. వారి వైమానిక దళం పూర్తిగా, సమూలంగా నాశనమైంది. వారి విమాన నిరోధక, సమాచార ప్రసార సామర్థ్యాలు పూర్తిగా నిర్వీర్యమైపోయాయి. అంతేకాదు, ఇరాన్ నాయకత్వం, సైనిక శక్తి కూడా నాశనమైంది. వారి నాయకులందరూ చనిపోయారు.. వారి సుప్రీం లీడర్ ఇక సర్వోన్నతుడు కాదు. ఆయన మరణించారని ట్రంప్ అన్నారు. ఇరాన్ ఆయుధ నిల్వలను తాము చిన్నాభిన్నం చేస్తున్నామని, ఎవరూ ఊహించని స్థాయిలో వారి క్షిపణి, డ్రోన్ కర్మాగారాలను ధ్వంసం చేస్తున్నామని ట్రంప్ తెలిపారు. వారి రక్షణ పారిశ్రామిక స్థావరాన్ని తుడిచిపెట్టేశామని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఆయతొల్లా అలీ ఖమేనీ మరణం తర్వాత, ఆయన కుమారుడైన మొజ్తబా ఖమేనీ ఇరాన్ బాధ్యతలు చేపట్టినట్లు వార్తలు వచ్చాయి. ఆయన ఇరాన్ రాజకీయాల్లో అత్యంత శక్తివంతుడిగా, వివాదాస్పద వ్యక్తిగా పేరు పొందారు. అయితే, ఆయన బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజుల్లోనే ఇటువంటి వార్తలు రావడం గమనార్హం. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలను ఇరాన్ ప్రభుత్వం ఇప్పటి వరకు అధికారికంగా ధృవీకరించలేదు, ఖండించలేదు. సాధారణంగా ఇరాన్ తన అత్యున్నత నాయకుల ఆరోగ్య స్థితిగతులను అత్యంత రహస్యంగా ఉంచుతుంది. గతంలో కూడా అలీ ఖమేనీ ఆరోగ్యంపై అనేక పుకార్లు వచ్చినప్పుడు ఇరాన్ నిశ్శబ్దంగానే ఉంది. ఇదే క్రమంలో వెనిజులా, ఇరాన్ తర్వాత క్యూబాపైనే అమెరికా సైన్యం దాడులు జరపనున్నట్లు ట్రంప్ హెచ్చరించారు. వెనిజులా, ఇరాన్‌పై అమెరికా సైన్యాలు విజయం సాధించాయని ట్రంప్ గొప్పగా చెప్పుకున్నారు. అమెరికా సైన్యపు విజయాలను ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. ఈ సదస్సులో ట్రంప్ మాట్లాడుతూ.. 'మా ప్రభుత్వం ఇటీవలి వారాల్లో క్యూబా నాయకత్వంలోని కొన్ని వర్గాలతో చర్చలు ప్రారంభించాం.. అమెరికా సైన్యం క్యూబాపై ప్రత్యక్ష సైనిక చర్యకు పాల్పడవచ్చుని ' అని కూడా ఈ సందర్భంగా ట్రంప్ చెప్పారు. కొన్నిసార్లు సైన్యాన్ని ఉపయోగించాల్సి వస్తుంది. అన్నట్టు తర్వాతి వంతు క్యూబాదే' అని అన్నారు. ఈ మాటలు అన్నతర్వాత ట్రంప్ మరలా.. నేను అలా అనలేదని అనుకోండి అని ట్రంప్ అన్నారు. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో జరగబోయే సైనిక ఘర్షణను నివారించే ప్రయత్నంలో తమ దేశం అమెరికాతో చర్చలు జరుపుతోందని క్యూబా అధ్యక్షుడు మిగెల్ డియాజ్ కానెల్ అంగీకరించారు. ఇప్పటికే అమెరికా ఆంక్షల వల్ల క్యూబాకు సరఫరా అయ్యే చమురు దిగుమతులు తగ్గాయి. దీంతో విద్యుత్ ప్లాంట్లు, రవాణాను నడపడానికి ఆధారపడే చమురు లేక క్యూబా ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నది. జనవరిలో వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోని ఆయన భార్యని పట్టుకోవడానికి అమెరికా చేపట్టిన ఆపరేషన్‌కు ముందు.. క్యూబాకు అవసరమైన చమురులో అధిక భాగం వెనిజులా సరఫరా చేసింది. కానీ ఆ తర్వాత వాషింగ్టన్ ఒత్తిడితో కారకాస్‌లోని కొత్త ప్రభుత్వం క్యూబాకు చమురు సరఫరాలను నిలిపివేసింది.

# మారనున్న ఆస్కార్ వేడుకల వేదిక

### 2029 నుంచి పీకాక్ థియేటర్‌లోకి మార్పు

లాస్ఏంజిల్స్,

ప్రపంచ చలనచిత్ర రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన 'అకాడమీ అవార్డ్స్' ఆస్కార్ ఒక చారిత్రాత్మక మార్పునకు సిద్ధమవుతోంది. దశాబ్దాలుగా హాలీవుడ్ వేదికగా జరుగుతున్న ఈ వేడుకలు, 2029 నుంచి లాస్ ఏంజిల్స్ డౌన్‌టౌన్‌లోని కొత్త వేదికకు మారనున్నాయి. అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ప్రకటించిన వివరాల ప్రకారం, 2029 నుంచి 2039 వరకు పదేళ్ల పాటు ఈ వేడుకలు లాస్ ఏంజిల్స్ లైవ్ కాంప్లెక్స్‌లోని 'పీకాక్ థియేటర్'లో జరగనున్నాయి. ఇందుకోసం ప్రముఖ వినోద సంస్థ తో అకాడమీ ఒప్పందం కుదుర్చుకుంది. 2001 నుంచి ఆస్కార్ వేడుకలకు ఆతిథ్యం ఇస్తున్న హాలీవుడ్ బౌలేవార్డ్ లోని 'డాల్బీ థియేటర్' యుగం, 2028లో జరగబోయే 100వ వార్షికోత్సవ వేడుకలతో ముగియనుంది. అప్పటివరకు ఈ వేడుకలు ఎబిసి ఛానల్‌లోనే ప్రసారమవుతాయి. అయితే, 2029 నుంచి 2033 వరకు జరిగే ఆస్కార్ వేడుకల ప్రసార హక్కులను యూట్యూబ్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. దీనివల్ల రెడ్ కార్పెట్, తెరవెనుక విశేషాలు మరియు ప్రధాన వేడుక వంటివన్నీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినిమా అభిమానులు యూట్యూబ్‌లో ఉచితంగా వీక్షించే అవకాశం కలగనుంది. అత్యాధునిక సాంకేతికత కలిగిన వేదికపై సినిమా పండుగను ప్రపంచవ్యాప్తంగా జరుపుకోవడానికి ఈ మార్పు ఎంతో దోహదపడుతుందని అకాడమీ ప్రతినిధులు పేర్కొన్నారు.

# చిన్నారులకు పౌష్టికాహారం తొలిముద్ద

### పథకాన్ని ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి

### అంగన్‌వాడీలకు సొంత భవనాలు నిర్మిస్తామని హామీ

### అంగన్‌వాడీలకు సెల్‌ఫోన్లు అందచేత

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

దేశంలో ప్రస్తుతం ఆహారభద్రత ఉంది కానీ, పౌష్టికాహారం అందట్లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శాసనసభ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద 'తొలిముద్ద' కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రెడీ టూ కుక్ ఫుడ్ ఉప్మా, కిచిడీ మిక్స్ ను బ్రేక్ ఫాస్ట్‌గా అందించనుంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ అమలు చేయడం వెనుక సహేతుక కారణం ఉందన్నారు. బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టికాహారం అందిస్తున్నాం. పిల్లలకు పౌష్టికాహారం అందితేనే మానసిక ఎదుగుదల ఉంటుందన్నారు. అంగన్వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబసభ్యుల్లా భావిస్తోంది. వారి సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నాం. అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదు. సొంత భవనాలు నిర్మించే చర్యలు చేపట్టాం. సమతులాహారం లేకపోవడం వల్లే ఎక్కువ సమస్యలు వస్తున్నాయని సీఎం అన్నారు. గతంలో దేశంలో నిరక్షరాస్యతను తగ్గించేందుకు, వ్యవసాయ అభివృద్ధికి తొలి ప్రధాని నెహ్రూ ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌కు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. దేశంలో ప్రస్తుతం ఆహార భద్రతఉంది.. కానీ పౌష్టికాహారం అందడం లేదు. అందుకే ప్రభుత్వం బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టిక ఆహారం అందిస్తోంది. అందుకే తాజాగా బ్రేక్ ఫాస్ట్ స్కీంను కూడా ప్రారభించాము. ప్రభుత్వం ఎంత మంచి ప్రణాళికలు చేసినా.. అమలు చేయాల్సింది అంగన్వాడీ టీచర్లు మాత్రమే. అందుకే ఈ ప్రభుత్వం మీపై గురుతర బాధ్యత పెట్టిందని రేవంత్ రెడ్డి అన్నారు. సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బందికి మొబైల్ ఫోన్లు సీఎం రేవంత్ రెడ్డి పంపిణీ చేశారు. అంగన్వాడీ భవనాలు నిర్మించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఏ మాత్రం ఆర్థిక వెసులుబాటు కలిగినా ముందుగా మీ సమస్యలనే పరిష్కరిస్తామని అంగన్వాడీలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీం, చైల్డ్ వెల్ఫేర్ కమిషన్ చైర్మన్ సీతా దయాకర్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బీబీనగర్ లో ప్రమాదవశాత్తు కారులో మంటలు, కారు పూర్తిగా దగ్ధం

### అప్రమత్తతో ప్రాణ నష్టం జరుగలేదు

### ఫోన్ చేసినా స్పందించని అగ్నిమాపక సిబ్బంది



**అక్షరకలం బీబీనగర్**

బీబీనగర్ మండల పరిధిలో, జాతీయ రహదారిపై, జైన్ ఇరిగేషన్ కంపెనీ సమీపంలో కేపాల్ వద్ద శనివారం ఓ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం టా 03 జుచీ 6575 నంబర్ గల కారు వరంగల్ నుంచి హైదరాబాద్ వైపు వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.అయితే ప్రమాదాన్ని గమనించిన కారు యజమాని వెంటనే అప్రమత్తమై వాహనం నుంచి దిగిపోవడంతో, ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదు. మంటలు వేగంగా వ్యాపించడంతో కారు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. సంఘటన గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా, వారు స్పందించలేదని తెలుస్తోంది. ఈ ఘటనపై బీబీనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# వెలుగుమట్లలో యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు..... రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు

### ఇందిరమ్మ ప్రభుత్వంలో పేదల సంక్షేమానికి ప్రాధాన్యం

### విద్యుత్, త్రాగునీటి సదుపాయాల పనులు పూర్తి

### లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసుకోవాలి

### వెలుగుమట్ల భూదాన్ భూముల్లో అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

వెలుగుమట్ల భూదాన్ భూముల్లో లబ్ధిదారులకు అన్ని సౌకర్యాలతో కూడిన మోడల్ కాలనీగా అభివృద్ధి చేసి పేదలకు గౌరవప్రదమైన జీవన వాతావరణం కల్పిస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.



శనివారం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ మ్యాప్ ద్వారా వివరిస్తూ కాలనీలో ఇప్పటికే విద్యుత్ స్తంభాల ఏర్పాటు, వీధి దీపాల పనులు పూర్తి అయ్యాయని, వాటర్ ట్యాంక్ నుండి ఇంటింటికీ త్రాగునీటి పైప్‌లైన్ అనుసంధానం జరుగిందని తెలిపారు. అలాగే అంతర్గత రోడ్ల నిర్మాణం, రవాణా సౌకర్యం కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల మౌలిక అవసరాలను ప్రాధాన్యంగా తీసుకుని ప్రతి కుటుంబానికి త్రాగునీరు, విద్యుత్, రోడ్లు వంటి సదుపాయాలు సమగ్రంగా అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత పది సంవత్సరాల కాలంలో పేదలు మౌలిక సదుపాయాల కొరతతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇందిరమ్మ ప్రభుత్వంలో ఆ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తున్నామని తెలిపారు. ప్రతి లబ్ధిదారుడికి నాణ్యమైన గృహ నిర్మాణం పూర్తి చేయించడమే లక్ష్యమని అన్నారు.వెలుగుమట్ల కాలనీలో విద్యుత్, త్రాగునీరు, రోడ్లు, కాలువలు, పారిశుద్ధ్య వ్యవస్థ వంటి అన్ని సదుపాయాలు సమగ్రంగా ఏర్పాటు చేసి ఆదర్శవంతమైన నివాస ప్రాంతంగా తీర్చిదిద్దుతామని మంత్రి స్పష్టం చేశారు. కాలనీలో స్కూల్, కమ్యూనిటీ హాల్, పార్క్ వంటి సామాజిక వసతులను కూడా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అంతర్గత రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలన్నారు. నెలలోపు డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేయాలని, వర్షాకాలం కాలనీలో నీటి నిలువ సమస్యలు ఉండకూడదని మంత్రి ఆదేశించారు.హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసుకోవాలని మంత్రి సూచించారు. అధికారులందరూ సమన్వయంతో పని చేసి మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేస్తూ, నిర్దేశిత గడువులోనే అన్ని పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, ఆర్‌డబీ ఎస్‌ఈ యాకుబ్, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్లు డి. జయచందర్, సైదులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి.. కిష్టాపురంలో విషాదం!







**అక్షరకలం మిర్యాలగూడ**

మిర్యాలగూడ మండల పరిధిలోని కిష్టాపురం గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 10 ఏళ్ల చిన్నారి బెజవాడ చందన మృతి చెందడం కలకలం రేపింది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ. లక్ష్మయ్య తెలిపిన వివరాల పోలీసుల ప్రకారం ఈ నెల 26 సాయంత్రం సుమారు 7.30 గంటల సమయంలో గ్రామ సెంటర్‌లో రోడ్డు దాటుతున్న బెజవాడ చంద్రమ్మ (60), ఆమె మనవరాలు చందన (10) ను వాడపల్లి వైపు నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న టీ ఎస్ 08 జేఎన్ 0545 నంబర్ గల మోటార్ సైకిల్ అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ఢీకొట్టినట్లు తెలిపారు. ప్రమాదంలో చంద్రమ్మకు కుడికాలు విరగగా, చిన్నారి చందనకు ఎడమ కాలు విరిగి లోపలి గాయాలు అయినట్లు పేర్కొన్నారు. ఇద్దరినీ తొలుత మిర్యాలగూడలోని వర్షిత హాస్పిటల్ కు తరలించి చికిత్స అందించగా, చందన పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. అయితే చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం 12.50 గంటలకు చందన మృతి చెందినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై మృతురాలి కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ కొనసాగుతున్నట్లు మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.

**--తల్లి తండ్రుల ఆవేదన...**

చిన్నారి చందన మృతి వార్త తెలియగానే ఆసుపత్రి వద్ద తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. "మా బిడ్డను కాపాడండి" అంటూ డాక్టర్లను వేడుకున్నా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చందన మృతి చెందడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. గ్రామంలో కూడా శోకసంద్రం ఏర్పడగా, చిన్నారి మృతితో గ్రామస్తులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనదారుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# నల్గొండ నగర నడిబొడ్డున "హైవే" మెరుపులు

### ఎన్ ఎచ్ 565 అభివృద్ధికి రూ.14.45 కోట్లు మంజూరు చేసిన కేంద్రం

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవతో మోక్షం పొందిన పెండింగ్ పనులు

### పానగల్ బైపాస్ నుంచి డీఈఓ ఆఫీస్ వరకు రోడ్డు విస్తరణ

### చిరు వ్యాపారులు, గృహ యజమానులకు ఊరటనిస్తూ బైపాస్ మీదుగా అలైన్‌మెంట్ మార్పు

### మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన మేయర్ చైతన్య శ్రీనివాస్ రెడ్డి

**ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం**





నల్గొండ పట్టణ వాసుల ట్రాఫిక్ కష్టాలకు త్వరలోనే చెక్ పడనుంది. నకిరేకల్ --నాగార్జునసాగర్ జాతీయ రహదారి (ఎన్ ఎచ్ - 565) అభివృద్ధిలో భాగంగా పట్టణ పరిధిలోని కీలక రస్తా విస్తరణకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2025--26 వార్షిక ప్రణాళిక కింద రూ.14.45 కోట్ల నిధులను మంజూరు చేస్తూ కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

**వివాదాలకు స్వస్తి...**

గతంలో పానగల్ బైపాస్ (ఇందిరా గాంధీ విగ్రహం) నుంచి రామగిరి, క్లాక్ టవర్ మీదుగా సాగర్ రోడ్డు వరకు రోడ్డు విస్తరణ ప్రతిపాదించగా, అనేక అడ్డంకులు ఎదురయ్యాయి. రోడ్డుకి ఇరువైపులా ఉన్న దుకాణాలు, ఇళ్లు కూలిపోతాయన్న ఆందోళనతో స్థానికులు కోర్టును ఆశ్రయించడంతో పనులు నిలిచిపోయాయి. ఈ ప్రతిష్టంభనను తొలగించేందుకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ప్రజలకు నష్టం కలగకుండా హైవే అలైన్‌మెంట్‌ను బైపాస్ మీదుగా మారుస్తూ ప్లాన్ సిద్ధం చేయించారు.

**నిధుల వేటలో మంత్రి సఫలం...**

కేంద్ర మంత్రులతో నిరంతరం సంప్రదింపులు జరిపి, తెలంగాణ ఆర్ అండ్ బీ శాఖ పంపిన ప్రతిపాదనలకు ఎటువంటి కోతలు లేకుండా పూర్తిస్థాయి ఆమోదం లభించేలా మంత్రి కోమటిరెడ్డి కృషి చేశారు. తాజా నిధులతో పానగల్ బైపాస్ నుంచి డీఈఓ ఆఫీస్ వరకు (3.4 కి.మీ) రహదారి మెరుగుపడుతుంది.?బ్లాక్ టాపింగ్ (బీ.టి ) ద్వారా రోడ్డు ఉపరితలాన్ని అత్యున్నత ప్రమాణాలతో నిర్మిస్తారు.టెక్నికల్ నోట్ ప్రకారం నిర్ణీత గడువులోనే పనులు పూర్తి చేయాలని కేంద్రం ఆదేశించింది.

**స్మార్ట్ సిటీ దిశగా అడుగులు...**

దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ రోడ్డు పనులకు నిధులు మంజూరు కావడం శుభపరిణామని, స్మార్ట్ సిటీ అభివృద్ధిలో భాగంగా ఈ రహదారిని సుందరీకరిస్తామని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. నల్గొండ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న మంత్రి కోమటిరెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు.కాగా ఈ నిధుల మంజూరుతో నల్గొండ పట్టణ రూపురేఖలు మారడమే కాకుండా, ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి రానుంది.

# నిమ్స్ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ చేసిన వైద్య శాఖ మంత్రి దామోదర :

**హైదరాబాద్ : మార్చి 28, ( అక్షర కలం న్యూస్ ):**

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దివంగత ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ సతీమణి విమల, ప్రజా కవి జయరాజు గార్లను పరామర్శించారు. అనంతరం , నిమ్స్ లోని ఓపి బ్లాక్ లో ఆకస్మిక తనిఖీ చేశారు. ఓపి బ్లాక్ లో అవుట్ పేషంట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను, ఫార్మసీ, శాంపిల్ కలెక్షన్ ల్యాబ్



లను నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ గార్లతో కలిసి పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన పేషంట్లతో మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆప్యాయత తో పలకరించారు. ఆస్పత్రిలో అందిస్తున్న సదుపాయాలపై పేషంట్ల ను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో పేషెంట్లకు, రోగులకు మెరుగైన వైద్య సదుపాయాల, సేవల కల్పన పై మంత్రి దామోదర్ రాజనర్సింహ నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప గారికి పలు సూచనలు చేశారు.

# నేటీ యుద్ద వ్యతిరేక ర్యాలీని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరు హజరవ్వాలి

### ఐ.ఎల్.డబ్లు.ఎఫ్ చైర్మన్ మీర్ ఇనాయత్ అలీ భాఖ్రి:

**హైదరాబాద్ :మార్చి 28,( అక్షర కలం న్యూస్ ):**

అమెరికా, ఇజ్రాయెల్ మరియు ఇరాన్ దేశాల మధ్య జరుగుతున్నయుద్ధాల వలన ప్రపంచ దేశాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,అలాంటి యుద్దాలు విరమించుకోవాలనిఈ నెల 29,వ తేది నాడు చార్మినార్ నుండి ఎగ్జిమీషన్ వరకుజరగబోవు యుద్ధ వ్యతిరేక ర్యాలీలో ఐ. ఎల్. డబ్లు. కి చెందిన ప్రతి ఒక్కరు హజరై విజయవంతం చేయాలని చైర్మన్ మీర్ ఇనాయత్ అలీ భాఖ్రి పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ జన సమితి పార్టీ రాష్ట ఎస్సి సెల్ అధ్యక్షులు చంద్రగిరి సత్యనారాయణ, మరియు ఇనాయత్ అలీ భాఖ్రి లు యుద్ద వ్యతిరేక ర్యాలీకి సంబందించిన కరపత్రాలను దారుషిఫా లోని ఒక కార్యాలయంలో ఆవిష్కరణ చేశారు. ఈ యద్ధం వల్ల ప్రపంచ దేశాల కంటే భారత దేశ ప్రజలే అధికంగా ఆర్ధిక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఇనాయత్అలీ భాఖ్రి ఆవేదన వ్యక్తం చేశారు.ఈ యుద్ధం వల్ల పెట్రోల్, ఆటో గ్యాస్ ల వంటీ చమురు దొరకక ఆటో డ్రైవర్లు గత పదిహేను రోజులుగా ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని పేర్కొన్నారు.అనంతరం టిజేఎస్ రాష్ట ఎస్సి సెల్ అధ్యక్షులు చంద్రగిరి సత్యనారాయణ మాట్లాడుతూ..ఈ యుద్ధం వలన దేశ ప్రజలు అనేక రకాలుగా నష్టాలను చవి చూస్తున్నారని, ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఈ యుద్ధంవలన ఆటో డ్రైవర్ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.కావున నేడు చార్మినార్ నుండి ఉదయం 10:30 నిముషములకు ప్రారంభం అయ్యే యుద్ద వ్యతిరేక ర్యాలీలో ప్రతి ఒక్కరు పాల్గొనినిరసన వ్యక్తం చేయాలని చంద్రగిరివిజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో అక్రమ్ ఖాన్, ఎండి మొహిన్, ఆసిఫ్ భేగ్, షేక్ మాజీద్, అడ్వకేట్ సోహేల్, ఎమ్ డి ఇక్బాల్ ఖాన్ మహిళా నాయకురాలు ఫర్హాజ్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

**సంపాదకీయం...**

# ఆందోళనకరంగా ద్రవ్యోల్బణం

పశ్చిమాసియా సంక్షోభం, ముడి చమురు ధరలు, ద్రవ్యోల్బణం, వడ్డీరేట్ల పెంపు.. ఇలా అనేక అంశాలు దేశ ఆర్థిక ప్రగతికి ప్రతిబంధకాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా ధరల పెరుగుదల, చమురు అలభ్యత, రూపాయి మారకం విలువ పెరగడం వెరసి భారత జిడిపిపై తీవ్ర ప్రభావం చూపుతోంద. ద్రవ్యోల్బణానికి కూడా కారణమవుతోంది. పశ్చిమాసియా యుద్ధ పరిస్థితులు ఇప్పట్లో సద్దుమణిగేలా లేవు. దీంతో ఇధంన లభ్యత ఎలా ఉంటుందో తెలియదు. ధరలు పెరగడం మాట ఎలా ఉన్నా అభ్యత అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ట్రంప్, ఇరా÷– పట్టుదలతో ఈ సంక్షోభం ఇప్పట్లో చల్లారేలా లేదు. ఈ ఏడాదికిగాను దేశ జీడీపీ వృద్ధి అంచనాలను అమెరికా బహుళజాతి ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్, అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం గోల్డ్‌మన్ సాచ్స్ మరోసారి తగ్గించింది. అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియా భగ్గుమంటున్న విషయం తెలిసిందే. గల్ఫ్ దేశాల్లో ముడి చమురు, ఎల్‌పీజీ, ఎల్ఎన్‌జీ ఉత్పత్తికి బ్రేకులుపడ్డాయి. భారత ఇంధన అవసరాల్లో దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతుండగా.. మిడిల్ ఈస్ట్ నుంచి పెద్ద ఎత్తునే వస్తున్నది. గత నెల 28 నుంచి ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ వైమానిక దాడులను ప్రారంభించాయి. అప్పట్నుంచి గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. అమెరికాకు మద్దతిస్తున్నారని పొరుగు దేశాలైన కువైట్, ఖతార్, యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్, ఇరాక్‌లపై ఇరాన్ దాడులు చేస్తున్నది. ఆయా దేశాల్లోని చమురు, గ్యాస్ క్షేత్రాలనే లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లను ప్రయోగిస్తున్నది. దీంతో క్రూడాయిల్, సహజ వాయువు ఉత్పత్తి నిలిచిపోయింది. పైగా మిడిల్ ఈస్ట్ నుంచి భారత్, చైనా సహా ఇతర దేశాలకు జరిగే రవాణాలో కీలకమైన హోర్ముజ్ జలసంధిని కూడా ఇరాన్ మూసేసింది. ఈ పరిణామం ఒక్కసారిగా గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు, గ్యాస్ ధరల పెరుగుదలకు దారితీసింది. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో ఆయా పెట్రో ఉత్పత్తుల ధరలూ పెరిగాయి. గ్యాస్ కొరత కూడా కనిపిస్తుండగా, దేశవ్యాప్తంగా చాలా హోటళ్లు, ఇతర గ్యాస్ ఆధారిత వ్యాపారాలు, పరిశ్రమలు మూతబడుతున్నదీ చూస్తూనే ఉన్నాం. ఎరువుల తయారీ కుంటుబడి వ్యవసాయ రంగం సైతం ప్రభావితం అవుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈసారి దేశ ఆర్థిక వృద్ధిరేటు 5.9 శాతాన్ని మించి ఉండబోదని గోల్డ్‌మన్ సాచ్స్ తాజాగా అభిప్రాయపడింది. 2026లో దేశ జీడీపీ వృద్ధి 7 శాతంగా ఉండొచ్చని గతంలో గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేసింది. అయితే ఈ నెల 13న దీన్ని 6.5 శాతానికి తగ్గించింది. ఇప్పుడు 5.9 శాతానికి కుదించింది. కేవలం 11 రోజుల్లోనే అర శాతానికి పైగా కోత పెట్టడం గమనార్హం. దీని వెనుక మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలే కారణంగా ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఇక రవాణా రంగంపైనా భారం పడుతుండగా.. పెరిగిన పెట్రోల్, డీజిల్ రేట్లతో ఆయా వస్తూత్పత్తులన్నింటి ధరలూ ఎగబాకి ద్రవ్యోల్బణం విజృంభిస్తున్నది. ఇది మరింత ముదిరితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రాబోయే ద్రవ్య సమీక్షల్లో కఠిన ద్రవ్య విధానాన్ని అనుసరించే అవకాశాలు లేకపోలేదు. దీంతో వడ్డీరేట్లు పెరగడం ఖాయమనే మెజారిటీ విశ్లేషకులు అంటున్నారు. అదే జరిగితే రుణ లభ్యత క్షీణించి అన్ని రంగాల్లో కార్యకలాపాలు మందగిస్తాయి. మొత్తంగా దేశ ఆర్థిక వ్యవస్థ ప్రభావితమవుతుందని గోల్డ్‌మన్ సాచ్స్ చెప్తున్నది. ముడి చమురు దిగుమతుల్లో ఏర్పడిన అంతరాయం.. దేశంలో అన్నింటి ధరల్ని ఎగదోయ గలదని గోల్డ్‌మన్ సాచ్స్ హెచ్చరిస్తున్నది. ఈ క్రమంలోనే ఈ ఏడాది ద్రవ్యోల్బణం 4.6 శాతానికి పెరుగవచ్చని అంచనా వేస్తున్నది. గతంలో ఇది 3.9 శాతంగానే ఉండటం గమనార్హం. కాగా, హర్ముజ్ జలసంధిలో వచ్చే నెల ప్రథమార్ధం వరకు పరిస్థితులు ఇలాగే ఉంటాయన్న అభిప్రాయాన్ని గోల్డ్‌మన్ సాచ్స్ వెలిబుచ్చుతున్నది. దీంతో భారత్ జీడీపీ అంచనాలు ఇంకా తగ్గిపోయినా ఆశ్చర్యం లేదన్న సంకేతాలు వస్తున్నాయి. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయిలో కదలాడుతున్నది. దీంతో ఈ ఒత్తిడి ఆర్బీఐపై తప్పక ఉంటుందని, అందుకే రెపోరేటు 50 బేసిస్ పాయింట్లు పెరిగే వీలున్నదని గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేస్తున్నది. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా రూపీ వాల్యూ దాదాపు 4 శాతం



పతనమైంది. సోమవారం తొలిసారి 94 మార్కునూ దాటేసింది. నిజానికి గత ఏడాది మొత్తంగా 4.7 శాతం పతనం నమోదైంది. కానీ ఈ 3 నెలల్లోనే ఇంచుమించుగా అంతటి నష్టాలు వాటిల్లాయి. రూపాయి విలువ పడిపోయినకొద్దీ దేశంలోకి వచ్చే దిగుమతులు ఖరీదవుతాయి. చివరకు ఈ భారం వినియోగ దారులపైనే పడుతుంది. ఇక దేశీయ కరెంట్ ఖాతా లోటు జీడీపీలో ఈ సంవత్సరం 2 శాతానికి పెరుగవచ్చని గోల్డ్‌మన్ సాచ్స్ చెప్తున్నది. ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థపై విదేశీ రుణ భారం పెరుగు తుందని, డాలర్ నిల్వలు పడిపోయే వీలుందని అంటున్నది. దీనికితోడు రూపాయి కనిష్ట స్థాయికి పడిపోతోంది. మారకం విలువ పడిపోవడం వివిధ రంగాలపై ప్రభావం చూపుతోంది. దీంతో రానున్న రోజుల్లో ద్రవ్యోల్బణం మరింత ఆందోళనకరంగా ఉండనుంది.




# కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలి

## లేబర్ కోడ్స్ ను వ్యతిరేకిస్తూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలి,

## 30న కొత్తగూడెంలో జరుగు నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి.--

## షేక్ యాకుబ్ షావలి

## మల్లెల వెంకటేశ్వర్లు.

అక్షర కలం / ఇల్లందు.



కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, లేబర్ కోడ్స్ ను వ్యతిరేకిస్తూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలని టి యు సి ఐ జిల్లా కార్యదర్శి షేక్ యాకుబ్ షావలి ఏరియా కార్యదర్శి మల్లెల వెంకటేశ్వర్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. టియుసిఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మార్చి 30న కొత్తగూడెంలో జరుగు నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కార్మికులను కోరారు. శనివారం జిసిసి, మున్సిపల్ కార్యాలయంలో కార్మికులను కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందు తరాల కార్మిక వర్గం పోరాడి రక్త తర్పణ చేసి సాధించిన 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, కార్మికుల శ్రమను కారు చౌకగా కార్పోరేట్ శక్తులకు దోచిపెట్టడానికి, కార్మికులను కట్టు బానిసలుగా తయారు చేయడానికి లేబర్ కోడ్స్ ను తీసుకురావడం దుర్మార్గమన్నారు. లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్స్ రద్దు కోసం, కార్మిక హక్కులను కాపాడుకోవడం కోసం చికాగో అమరవీరుల పోరాట స్ఫూర్తితో కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. లేబర్ కోడ్స్ ను వ్యతిరేకిస్తూ మార్చి 30న కొత్తగూడెంలో జరుగు నిరసన కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఏరియా నాయకులు బోళ్ళ సీతారాములు, బొల్లి రవి, మోటం సంపత్, భాజ్య శీను, శ్యామ్, స్వచ్ఛ టాటా మ్యాజిక్ యూనియన్ నాయకులు బండి రాజమ్మ, రాజేష్, సంపత్,స్వప్న,అక్బర్, సాల్మన్ రాజ్,పుష్ప తదితరులు పాల్గొన్నారు.

# వైరా రోడ్డు ప్రమాద ప్రదేశాన్ని సందర్శించిన పోలీస్ కమిషనర్

## సైన్ బోర్డు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆదేశం

అక్షర కలం/ వైరా :



వైరాలో జరిగిన రోడ్డు ప్రమాద ప్రదేశాన్ని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించారు.శనివారం వైరాలో రిలయన్స్ ట్రెండ్ వద్ద జరిగిన ఆర్టీసీ బస్సును, లారీ కంటైనర్ ఢీ కొన్న ఘటనలో పలువురు ప్రయాణికులు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే స్పందించిన పోలీసులు క్షతగాత్రులను 108 వాహనంలో హాస్పిటల్ తరలించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. అనంతరం కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ వైరాలోని ప్రమాద ప్రదేశాన్ని సందర్శించి ప్రమాదం గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.వెంటనే సైన్ బోర్డు, స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని, స్లిప్ రోడ్డును తక్షణమే సరిచేయమని సంబంధిత అధికారులకు సూచించారు ఆదేశించారు. ప్రభుత్వ 99 రోజుల 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ఈ వారాన్ని 'అరైవ్ అలైవ్' ప్రచారాన్ని ప్రజల్లో తీసుకెళ్లేందుకు అంకితమైనట్లు తెలిపారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తి సురక్షితంగా ఇంటికి చేరుకోవడానికి సురక్షితమైన వాహనం నడపడం చాలా ముఖ్యమని అన్నారు. కుటుంబాలు క్షేమంగా ఉండాలని లక్ష్యంతో చేపట్టిన'అరైవ్ అలైవ్' భావనపై దృష్టి పెట్టి ముఖ్యంగా బయటకు వెళ్తున్న తమ భర్తలను, కుమారులను సురక్షితంగా వాహనం నడిపి క్షేమంగా ఇంటికి తిరిగి రావాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చెప్పాలని విజ్ఞప్తి చేశారు. అదేవిదంగా ఖమ్మంలో, వివిధ పోలీస్ స్టేషన్లు ఇతర శాఖలతో కలిసి 'అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ, సూచిక బోర్డులను ఏర్పాటు చేయడం, గుంతలను పూడ్చడం, చెత్తాచెదారాన్ని తొలగించడం వంటి దిద్దుబాటు చర్యలు తీసుకుంటున్నాయని పేర్కొన్నార.

# ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరిస్తా : పి ఆర్ టి యు ఖమ్మం జిల్లా శాఖకు కలెక్టర్ హామీ

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

ఖమ్మం:ఉపాధ్యాయులకు సంబంధించిన వివిధ సమస్యల పరిష్కార నిమిత్తం పి ఆర్ టి యు టి ఎస్ ఖమ్మం జిల్లా శాఖ అధ్యక్షులు కట్టా శేఖర్రావు నాయకత్వంలో జిల్లా కలెక్టర్ శ్రీ అనుదీప్ దురిశెట్టి ని కలిసి వినతి పత్రం సమర్పించారు . 2025 మే నెలలో జరిగిన వృత్యంతర శిక్షణకు సంబంధించిన సంపాదిత సెలవు మంజూరు చేయాలని , 2025 పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు , సమగ్ర కుటుంబ సర్వే విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు పారితోషికం ఇప్పించాలని కోరారు . కల్లూరు సబ్ కలెక్టర్ ప్రభుత్వ ఉత్తర్వులకు భిన్నంగా పాఠశాలలను అదనపు సమయం నడపాలని ఒత్తిడి చేస్తూ, చిన్న కారణాలతో షోకాస్ నోటీసులు , సస్పెన్షన్లు చేస్తూ , నోటీసులు జారీ చేస్తూ ఉపాధ్యాయులను ఆందోళన గురిచేస్తున్న విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు . ఎవరీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం అమల్లో ఉపాధ్యాయులు ఇతోధికంగా కృషి చేస్తున్న విషయాన్ని విన్నవించి , ఇటీవల విధుల నుంచి తొలగింపబడిన భూక్య గౌతమి ఎస్ ,



ఏ (ఇంగ్లీష్) మరియు కేజీబీవీ రఘునాధపాలెం ఎస్ ఓ లతలను విధుల్లోనికి తిరిగి తీసుకోవాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్ రావు తెలిపారు . ఈ కార్యక్రమంలో పిఆర్టియు జిల్లా శాఖ ఉపాధ్యక్షులు సోమ్లా , లింగం సతీష్ , గుడిపూడి శ్రీనివాసరావు , తాళ్లూరి చంద్రశేఖర్ , ఎన్ వెంకన్న , ఖమ్మం నగర శాఖ ప్రధాన కార్యదర్శి శాంతా రెడ్డి , ఖమ్మం అర్బన్ అధ్యక్షులు బి రవి కిరణ్ , రాష్ట్ర నాయకులు ముప్పా వేణు మాధవరావు , జిల్లా ఉపాధ్యక్షులు రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు .

# వీధి కుక్కల బెడదను నివారించండి

## అధికారులకు కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశం

## జిల్లాలో సురక్షిత వాతావరణమే లక్ష్యం

## స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ ముమ్మరం

అక్షరకలం యాదాద్రిభువనగిరి




యాదాద్రి భువనగిరి జిల్లాలో వీధి కుక్కల బెడదను నివారించి, ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించడమే లక్ష్యంగా అధికారులు కట్టుదిట్టంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్‌లో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్, ఎస్పీ అక్షాంశ్ యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, మున్సిపల్ కమిషనర్లు, పశుసంవర్ధక శాఖ సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వీధి కుక్కల బెడద అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కుక్కల నియంత్రణ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రభావిత ప్రాంతాల్లో కుక్కలను బంధించడం, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు కుక్కకాటు ద్వారా వ్యాపించే రేబిస్ వ్యాధిని నివారించేందుకు వీధి కుక్కలను గుర్తించి, వాటికి యాంటీ రేబిస్ టీకాలు వేయాలని స్పష్టం చేశారు.అలాగే కుక్కలను నియంత్రించేందుకు పెద్దఎత్తున స్టెరిలైజేషన్ (జనన నియంత్రణ) ఆపరేషన్లు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా పాఠశాల, ఆసుపత్రి, ఆర్టీసీ బస్టాండ్ లు వంటి ప్రజలు అధికంగా రాకపోకలు చేసే ప్రాంతాల్లో ఉన్న కుక్కలను వెంటనే నియంత్రించాలని పేర్కొన్నారు. స్టెరిలైజేషన్ అనంతరం కుక్కలను తగిన షెల్టర్లలో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ రహదారులపై వీధి కుక్కలు మరియు ఇతర జంతువులు సంచరించడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నివారించేందుకు ప్రత్యేక పెట్రోలింగ్ బృందాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఆసుపత్రుల వద్ద కుక్కలను గుర్తించి, వాటికి స్టెరిలైజేషన్ చర్యలు చేపట్టాలని తెలిపారు. స్టెరిలైజేషన్, రేబిస్ టీకా డ్రైవ్ ను క్రమం తప్పకుండా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పశు సమర్ధక శాఖ వైద్యులు, మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. అదేవిధంగా చెత్త నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల వీధి కుక్కల సంఖ్య పెరిగే అవకాశం ఉందని మున్సిపల్ అధికారులు చెత్త సేకరణను క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ మాట్లాడుతూ, జిల్లాలో వీధి కుక్కలను గుర్తించి వాటికి స్టెరిలైజేషన్ చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా జనాభా ఎక్కువ ఉండే చోట క్రమం తప్పకుండా డ్రైవ్ నిర్వహించి కుక్కలకు స్టెరిలైజేషన్ చేయాలని అన్నారు.అలాగే కుక్కలు రోడ్లపై తిరగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.రోడ్ల పై తిరిగే జంతువులను, కుక్కలను తరచూ పెట్రోలింగ్ చేస్తూ గుర్తించి ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, ఆర్ అండ్ బి శాఖ అధికారి సరిత, పశుసంవర్ధక శాఖ అధికారి జానయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, జిల్లా వైద్యశాఖ అధికారి మనోహర్, జిల్లా రవాణా శాఖ అధికారి సాయి కృష్ణ, మున్సిపల్ కమిషనర్లు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

## ఆట



# రాజస్థాన్ రాయల్స్ వాటా దక్కించుకున్న షేన్ వార్న్

రాజస్థాన్ రాయల్స్ విక్రయంతో ఆస్ట్రేలియా దిగ్గజం, దివంగత క్రికెటర్ షేన్ వార్న్ కుటుంబానికి భారీ జాక్?పాట్ తగిలింది. ఫ్రాంచైజీ విక్రయించగా వచ్చిన మొత్తంలో వార్న్ ఫ్యామిలీకి 3 శాతం వాటా దక్కనుంది. దీంతో అతడి కుటుంబానికి రూ.400o కోట్లు దక్కనున్నాయి. 2008 ఐపీఎల్ తొలి సీజన్?కుగానూ రాజస్థాన్? రాయల్స్ షేన్ వార్న్?ను దక్కించుకుంది. అతడు 2008–2011 మధ్య కాలంలో నాలుగు సీజన్లపాటు రాజస్థాన్?కు ఆడాడు. ఈ సమయంలో వార్న్ మొత్తం రూ.9.35 కోట్ల శాలరీ అందుకున్నాడు. అయితే శాలరీతోపాటు రాజస్థాన్?కు ఆడినన్ని రోజులు ఫ్రాంచైజీ నుంచి ఏటా 0.75 శాతం వాటా దక్కించుకున్నాడు. అలా ఆర్ఆర్ తరపున నాలుగు సీజన్లు ఆడిన వార్న్?కు మొత్తం 3 శాతం వాటా దక్కింది. గత 18ఏళ్లుగా వాటా అలాగే కొనసాగుతూ వచ్చింది. తాజాగా రాజస్థాన్ ఫ్రాంచైజీని విక్రయించారు. ఈ మొత్తం ఫ్రాంచైజీని అమెరికాకు చెందిన వ్యాపారవేత్త కల్ సొమానీకు చెందిన కన్సార్షియం రూ.15,300 కోట్ల ధరకు ఈ ఫ్రాంఛైజీని దక్కించుకుంది. దీంతో ఈ 3 శాతం వాటా విలువ కూడా అమాంతం పెరిగింది. అందులో సుమారు రూ.460 కోట్ల దాకా వార్న్ కుటుంబానికి అందుతాయని ప్రచారం సాగుతోంది. అయితే రాజస్థాన్ విక్రయం డీల్?కు బీసీసీఐ ఆమోదం తెలుపాల్సి ఉంది.ఐపీఎల్ టైటిల్ అందుకున్న తొలి కెప్టెన్?గా వార్న్? పేరిట అరుదైన రికార్డు ఉంది. తొలి సీజన్ (2008)?లోనే రాజస్థాన్ రాయల్స్?కు కెప్టెన్?గా వ్యవహరించిన అతడు జట్టును ఛాంపియన్?గా నిలిపాడు. ఫైనల్?లో చెన్నై సూపర్? కింగ్స్?పై రాజస్థాన్ విజయం సాధించింది. ఆ సీజన్?లో అతడు 15 మ్యాచ్?ల్లో 19 వికెట్లతో రాణించాడు. ఆ తర్వాత మూడు సీజన్లపాటు ఐపీఎల్? ఆడాడు. 2011 తర్వాత ఐపీఎల్?కు రిటైర్మెంట్ ఇచ్చేశాడు. ఓవరాల్?గా వార్న్ ఐపీఎల్?లో 54 మ్యాచ్?ల్లో 57 వికెట్లు పడగొట్టాడు.వార్న్?కు ముగ్గురు పిల్లలున్నారు. ఒకవేళ రాజస్థాన్ నుంచి ఈ షేర్ దక్కితే అది తమ పిల్లలకు చేరే అవకాశం ఉంది.







# దక్షిణాఫ్రికాదే టీ20 సిరీస్..

### ఐదో టీ20లో

## న్యూజిలాండ్‌పై ఘన విజయం

సొంత గడ్డపై న్యూజిలాండ్ జట్టుకు పరాభవం ఎదురైంది. 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను దక్షిణాఫ్రికా కైవసం చేసుకుంది. బుధవారం క్రైస్ట్‌చర్చ్ వేదికగా జరిగిన ఐదో టీ20 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు 33 పరుగుల తేడాతో న్యూజిలాండ్ జట్టుపై గెలుపొందింది. తద్వారా టీ20 సిరీస్‌ను 3–2తో గెలుపొందింది.ఐదో టీ20 మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా జట్టు.. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 187 పరుగులు సాధించింది. సఫారీ బ్యాటర్లలో కానర్ ఎస్టర్‌హుయిజెన్ (75; 33 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్సర్లు) విధ్వంసకర హాఫ్ సెంచరీ చేశాడు. రూబిన్ హెర్మాన్ (39), వియాన్ ముల్డర్ (31), డయాన్ ఫోరెస్టర్ (21 నాటౌట్) రాణించారు. న్యూజిలాండ్ బౌలర్లలో బెన్ సియర్స్ రెండు వికెట్లు పడగొట్టగా.. జాకరీ ఫౌల్క్స్, జోష్ క్లార్క్సన్ చెరో వికెట్ సాధించారు. అనంతరం 188 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ టీమ్.. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 154 పరుగులకే పరిమితమైంది. న్యూజిలాండ్ బ్యాటర్లలో బెవోన్ జాకబ్స్ (36; 19 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లు) రాణించాడు. జేమ్స్ నీషమ్ (24), డేన్ క్లీవర్ (24) లు పర్వాలేదనిపించారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఒట్నీల్ బార్ట్‌మాన్, గెరాల్డ్ కోట్జీ, వియాన్ ముల్డర్‌లు తలా రెండు వికెట్లు సాధించారు. కేశవ్ మహారాజ్ ఓ వికెట్ పడగొట్టాడు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక




## సినిమా
CINEMA




# రణ్‌వీర్ తదుపరి చిత్రంపై ఆసక్తి

'ధురంధర్ 2' బాక్సాఫీస్ దగ్గర వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. 7 రోజుల్లోనే రూ.1000 కోట్ల క్లబ్‌లో చేరిన ఈ స్పై థ్రిల్లర్.. టూ థౌజండ్ క్రోర్ దిశగా దూసుకెళుతోంది. ఈ మూవీ గ్రాండ్ సక్సెస్ తర్వాత రణవీర్ సింగ్ తదుపరి ఏ మూవీ చేయబోతున్నాడన్న ఆసక్తి అందరిలో నెలకొంది. అయితే ధురంధర్ ఊహించని హిట్ తర్వాత పర్హాన్ అక్తర్‌కు హ్యాండిచ్చాడు గల్లీబాయ్. 'డాన్ 3' ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నాడు. అంతకు ముందు సౌత్ దర్శకులు ప్రశాంత్ వర్మ, బాసిల్ జోసెఫ్‌తో కొంత కాలం ట్రావెల్ చేసి.. వాళ్ల టైం, ఎనర్జీని వేస్ట్ చేయించి తర్వాత గుడ్ బై చెప్పిన ఎక్స్‌పీరియన్స్ ఈ హీరోది. బోయపాటి శీను, ఎస్ శంకర్ కూడా రణవీర్ సింగ్‌ను సెట్ చేసేందుకు ట్రై చేస్తున్నారట. కానీ రణవీర్ మాత్రం ఓ బాలీవుడ్ దర్శకుడికి కమిటయ్యాడని తెలుస్తోంది. రణవీర్ నెక్స్ట్ జాంబిస్ స్టోరీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడట. స్కామ్ 1992 అసిస్టెంట్ డైరెక్టర్, లూటేరే సిరీస్ తెరకెక్కించిన జై మెహతా ఈ సినిమాను దర్శకత్వం వహించబోతున్నట్లు తెలుస్తోంది.




# ధురంధర్ ప్రచారంపై చర్యలు తప్పవు

దర్శకుడు ఆదిత్య ధర్ తన తాజా చిత్రం 'ధురంధర్: ది రివెంజ్' పై సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారంపై స్పందించారు. నెట్టింట వైరల్ అవుతున్న ఒక మార్ఫింగ్ ఫోటోపై ఆయన స్పష్టతనిచ్చారు. అది సినిమాకు సంబంధించినది కాదంటూ పోస్ట్ పెట్టారు. ప్రపంచవ్యాప్తంగా 'ధురంధర్2' చిత్రానికి లభిస్తోన్న ఆదరణ చూసి నా హృదయం ఆనందంతో ఉప్పొంగుతోంది. అయితే, కొంతమంది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) ఉపయోగించి మా అధికారిక ప్రోమోలను మారుస్తూ తప్పుడు కథనాలను సృష్టిస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది. ముఖ్యంగా, ఈ చిత్రంలోని హంజా (జస్కీత్) పాత్ర తలపాగా ధరించి సిగరెట్ తాగుతున్నట్లు ఉన్న ఒక ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇది పూర్తిగా అబద్ధం. మా సినిమాలో కానీ, మేము విడుదల చేసిన ఏ ఇతర అధికారిక వీడియోల్లో కానీ అలాంటి సీన్ లేదు. ఇది కేవలం ఉద్దేశపూర్వకంగా అలజడులు సృష్టించాలని కొందరు చేస్తోన్న పని. సిక్కులు అంటే నాకెంతో గౌరవం. ఈ చిత్రంలో ప్రతి పాత్రను ఎంతో బాధ్యతతో వారిపై గౌరవంతోనే చిత్రీకరించాం. ఏఐతో సృష్టించిన ఇలాంటి తప్పుడు సమాచారాన్ని ఎవరూ నమ్మొద్దని కోరుతున్నాను. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడే వారిపై త్వరలోనే కఠిన చర్యలు తీసుకుంటాను అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా తెరకెక్కిన 'ధురంధర్ 2' మార్చి 19న విడుదలైంది. తొలిరోజు నుంచే వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ఏడు రోజుల్లో రూ.1000కోట్ల క్లబ్‌లో చేరినట్లు సినీ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటివరకూ రూ.1,006 కోట్లు తన ఖాతాలో వేసుకుంది.



# ఉస్తాద్‌లో పవన్ కళ్యాణ్ ఎంట్రీ అదుర్స్

పవన్ కల్యాణ్ హీరోగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'సినిమాలో పవన్ ఎంట్రీ సీన్‌పై సోషల్ మీడియాలో వచ్చిన ట్రోల్స్‌పై హరీశ్ శంకర్ స్పందించారు. ఆయన జీప్‌లో నుంచి రెండుసార్లు దిగడం ఒకే సీన్‌లో చూపించారని కొందరు విమర్శించారు. దీనిపై హరీశ్ స్పందిస్తూ తనకు రెండు ఎంట్రీలు నచ్చాయని అందుకే పెట్టినట్లు తెలిపారు. కొన్నికొన్ని సన్నివేశాల్లో స్వేచ్ఛ తీసుకుంటా. ఉస్తాద్ భగత్ సింగ్‌లో పవన్ (ఖజీలిజీని ఐజీ÷ూజీని) ఫస్ట్ జీప్‌లో నుంచి దిగుతారు. ఆ సమయంలో ఒక బాడీ పడుతుంటే ఆయన దిగడం చూపించా. ఆ తర్వాత మళ్లీ జీప్ నుంచి జంప్ చేస్తూ కిందకు వస్తారు. ఇదేంటి రెండుసార్లు ఎలా దిగారని కొందరు అన్నారు. అలాంటివి పట్టించుకోను. నాకు రెండు షాట్లూ నచ్చాయి. నేను ఒక షాట్ తీశా. మాస్టర్ ఇంకోటి తీశారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# అర్జీలపై సత్వరమే చర్యలు తీసుకోండి

## అధికారులకు జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశం

## దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక ప్రజావాణి

## 74 దరఖాస్తుల స్వీకరణ

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం



ప్రత్యేక ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్ర శేఖర్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో దివ్యాంగులు, వృద్ధుల నుండి ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులు సోమవారం నిర్వహించే ప్రజావాణి లో ఇబ్బంది పడవద్దని వారికై ప్రతి నెల నాల్గవ శనివారం ప్రత్యేక ప్రజావాణి నిర్వహిస్తున్నామని ఇట్టి అవకాశన్ని జిల్లాలోని దివ్యాంగులు, వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శనివారం దివ్యాంగులు, వృద్ధుల కొరకు నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమం లో మొత్తం 74 దరఖాస్తులు వచ్చాయి. ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్ కుమార్, ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ నరసింహారావు నేత, అధికారులు, సిబ్బంది, తదితరులు హాజరయ్యారు.

# జిల్లాలో సదరం కేసులు పెండింగ్ లేకుండా చూడాలి

## వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించిన సెర్ప్ సీఈఓ దివ్య





యాదాద్రి భువనగిరి అక్షర కలం

జిల్లాలో సదరం పెండింగ్ కేసులు లేకుండా త్వరితగతిన పూర్తిచేయాలని, అలాగే యూడిఐడి దరఖాస్తులపై వేగవంతంగా చర్యలు తీసుకోవాలని సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ అన్నారు. శనివారం జిల్లా అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ జిల్లాలో సదరం సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పెండింగ్ కేసులను త్వరితగతిన క్లియర్ చేయాలి. యూడిఐడి దరఖాస్తులు వచ్చిన వెంటనే సదరంలో లో నమోదు చేయాలన్నారు. కొత్త దరఖాస్తులపై సమయానికి వికలాంగత సర్టిఫికేట్లు జారీ చేయాలని, రెన్యువల్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కారం కోసం ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలి. యూడిఐడి కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేసి, సంబంధిత డేటాను నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. డిజిటైజేషన్, సరెండర్ మరియు పోగొట్టుకున్న కార్డుల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. ఎన్ హెచ్ సి, పి డబ్ల్యూ డి, మరియు ఎస్ హెచ్ జి సభ్యులతో యూడిఐడి కార్డులు లేనివారికి వెంటనే జారీ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి మాట్లాడుతూ, ఈ నెలకు సంబంధించిన సదరం స్లాట్లు ఇప్పటికే విడుదలయ్యాయని తెలిపారు. లబ్ధిదారులు క్యాంపులకు సకాలంలో హాజరు కావడానికి వారికి ఫోన్ కాల్ ద్వారా ముందస్తుగా సమాచారం ఇవ్వాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో డా. కిరణ్ (ఆర్ ఎం ఓ, ప్రభుత్వ ఆసుపత్రి భువనగిరి), సుమన్ (ఏపీఓ పెన్షన్) మరియు సదరం సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రపంచ శాంతికి "బౌద్ధమే" మార్గం


## శ్రీలంక మంత్రి హిణిదుమ సునీల్ సేన్వి

## బుద్ధవనం అద్భుతం.. శ్రీలంకలోనూ ఇలాంటి ప్రాజెక్టులు అవసరం

## 21 దేశాల ప్రతినిధులతో శ్రీలంక మంత్రి పర్యటన







ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం

ప్రస్తుత పరిస్థితులలో ప్రపంచంలో శాంతి స్థాపన అత్యంత కీలకమని శ్రీలంక బుద్ధ సేన రిలీజియస్, సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి హిణిదుమ సునీల్ సేన్వి అన్నారు. శనివారం ఆయన నల్గొండ జిల్లా, నాగార్జునసాగర్ వద్ద ఉన్న బుద్ధవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారతదేశంలో, ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్రంలో ఎంతో గుర్తింపు పొందిన, ప్రాచుర్యం పొందిన బుద్ధిష్టు మాన్యుమెంట్స్ ఉండడం, ప్రత్యేకించి బుద్ధవనం ప్రాజెక్టు ఎంతో ప్రాముఖ్యత పొందిందని అన్నారు. సమకాలీన ప్రపంచంలో శాంతి అతి ముఖ్యమన్నారు. బుద్ధిజం నుండి అనేక విషయాలను నేర్చు కోవచ్చుని, శుక్రవారం హైదరాబాదులో నిర్వహించిన ప్రపంచ బుద్ధ శాంతి సమావేశం తనకు ఎంతో సంతృప్తిని, విశేష అనుభవాన్ని కలిగించిందని తెలిపారు. బుద్ధవనం లాంటి ఆధునిక బుద్ధ ప్రాజెక్టులు మరియు నమూనాలను శ్రీలంకలో కూడా విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మంత్రి పర్యటనలో 21 దేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులు, బిక్షుణీలు, విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బుద్ధవనం చైర్మన్ మల్లెపల్లి లక్ష్మయ్య, బుద్ధవనం ఫౌండర్ మాజీ డీజీపీ ఆంజనేయ రెడ్డి, నటుడు శ్రీ గగన్ మాలిక్, వియత్నాం ప్రొఫెసర్ వైస్ ఛాన్సలర్ తిక్నాథ్ టు, నవ నలంద వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సిద్ధార్థ్ సింగ్, శాసన సభ్యుడు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.




# గ్రామ పంచాయతీ పాలకవర్గ ఆధ్వర్యంలో 15 లక్షల రూపాయల ప్రమాద భీమా

ఆత్మకూరు (ఎం) అక్షర కలం




యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండల పరిధిలోని పారుపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ దయ్యాల మాధవి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సిబ్బంది కి సన్మానం చేయడం జరిగింది. అలాగే సిబ్బంది కి 15 లక్షల రూపాయల ప్రమాద భీమా చేపించి వారికి ఇన్సూరెన్స్ పత్రాలు అందించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ తవిటి మల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి పృధ్వికుమార్, వార్డ్ మెంబర్లు చెవ్వ సుజాత, బద్దిపడిగ మల్లారెడ్డి, పోలేపాక నరేశ్, అన్నెబోయిన కావ్య, పోతుగంటి శ్రీను, పట్టూరి ఆగయ్య మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ముత్యాలమ్మ తల్లి అనుగ్రహం అందరికీ కలగాలి: మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్



అక్షరకలం దేవరకొండ

ప్రతి ఒక్కరూ మాల్ గడ్డ ముత్యాలమ్మ తల్లి అనుగ్రహం పొంది, సుఖసంతోషాలతో ఉండాలని బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్రకుమార్ ఆకాంక్షించారు. శనివారం దేవరకొండ మండలంలోని మాల్ గడ్డ ముత్యాలమ్మ తల్లిని ఆయన దర్శించుకుని, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రకుమార్ మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజలందరూ అమ్మవారి ఆశీస్సులతో ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని, దైవ ప్రార్థనల వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రవీంద్రకుమార్ వెంట పలువురు టీవీన్ రెడ్డి (బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు), బొడ్డుపల్లి కృష్ణ, అంజి, అంజయ్య ఇతర పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు. బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు:

# హనుమాన్ జయంతి కి ఆలేరు ఎమ్మెల్యేను ఆహ్వానించిన సర్పంచ్ ఉపేందర్ రెడ్డి

ఆత్మకూరు (ఎం)అక్షర కలం



యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం సర్వేపల్లి గ్రామంలో ఏప్రిల్ 2 వ తేదీన శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ విజయోత్సవ ర్యాలీ సందర్భంగా ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ను ఆహ్వానించిన స్థానిక సర్పంచ్ కల్వకుంట్ల ఉపేందర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి మోటకొండూర్ కార్తీక్ శర్మ, ఉప సర్పంచ్ ఏషబోయిన వెంకటేష్, వార్డు మెంబర్లు పంది మహేష్ ,మచ్చ రాజు, కొమ్ము స్వామి, గ్రామ శాఖ అధ్యక్షుడు ఏషబోయిన రవి,ఏషబోయిన స్వామి,మర్రిపల్లి దశరథ,మన్నురి మార్కండేయ, జామండ్ల జగన్,మచ్చ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# గోడుకొండ్ల రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్

అక్షరకలం దేవరకొండ

మండల పరిధిలోని గోడుకొండ్ల గ్రామంలో వెలసిన సీతారామచంద్రస్వామి జాతర మహోత్సవాలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా నిర్వహించిన రథోత్సవ కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలునాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథోత్సవంలో భక్తులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండూరు భవాని పవన్ కుమార్, మాజీ సర్పంచ్ అంగురేకుల గోవర్ధన్, మండల పార్టీ అధ్యక్షులు నాగభూషణం, మాజీ జడ్పీటీసీ హరినాయక్, దేవస్థానం కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శేఖర్ గౌడ్, మద్దెల కృష్ణ, ఊరె లక్ష్మణ్, ఖలీల్ మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# ప్రియాన్ష్ కుటుంబ సభ్యులను పరామర్శించిన భువనగిరి ఎంపీ చామల

యాదాద్రి భువనగిరి అక్షర కలం

భువనగిరి పట్టణంలోని తారక రామ నగర్ కు చెందిన సందెల ప్రియాన్ష్ కుటుంబ సభ్యులను భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి శనివారం హైదరాబాద్ ఎల్.వి ప్రసాద్ ఆసుపత్రిలో కలిసి పరామర్శించారు. ఈనెల 26 న భువనగిరి లో ప్రియాన్ష్ పై కుక్కలు దాడి చేసి కనుగుడ్డు పీకేసిన విషయం తెలుసుకున్న చామల కిరణ్ కుమార్ రెడ్డి పోన్ ద్వారా మాట్లాడి వారికి మనోధైర్యం కల్పించారు. శనివారం స్వయంగా ప్రియాన్ష్ కుటుంబ సభ్యులను కలిసి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, బీబీనగర్ ఎయిమ్స్ వైద్యులతో ప్రియాన్ష్ వైద్యం గురించి మాట్లాడారు. బాలుని కి మెరుగైన వైద్యం అందించాలని, ప్రభుత్వమే పూర్తి ఖర్చులు భరిస్తుందని తెలిపారు. బాలుడు ప్రియిన్ష్ కు భవిష్యత్తులో ఇబ్బంది కలుగకుండా చూడాలని కలెక్టర్, వైద్యులను కోరారు. ప్రియాన్ష్ కు ప్రభుత్వం తో పాటు తానుకూడా పూర్తి సహకారం అందిస్తానని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఎంపీ తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పోత్నక్ ప్రమోద్ కుమార్, ఎండీ అతహర్ తదితరులు ఉన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

## మార్నింగ్ వాక్ లో గ్రామ సమస్యలు తెలుసుకుంటున్న సర్పంచ్ ఎరుకల యతీశ్వర్ గౌడ్





**ఆత్మకూరు (ఎం) అక్షర కలం**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం)మండలం రాఘవాపురం గ్రామంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మండలం లో మరియు గ్రామంలో మొదటి సారిగా సర్పంచ్,పంచాయతీ కార్యదర్శి మరియు పాలక వర్గ సభ్యులు, గ్రామ ప్రజలు అందరూ కలిసి మార్నింగ్ వాక్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా గ్రామ వీధుల్లో తిరుగుతూ గ్రామ ప్రజల సమస్యలని తెలుసుకోవడం జరిగింది.ఇందిరమ్మ ఇల్లు పురోగతిని కూడా పరిశీలించడం జరిగింది. లబ్ధిదారులని వెంటనే పూర్తి చేయగలరని చెప్పడం జరిగింది. ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేయడం జరిగింది మరియు మధ్యాహ్నం భోజన ను తనిఖీ చేసి అక్కడే పిల్లలతో భోజనం చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో సర్పంచ్ యరుకల యతీశ్వర్ గౌడ్ ,ఉప సర్పంచ్ మహమ్మద్ మున్నీ అమీరుద్దీన్,పంచాయతీ కార్యదర్శి గుర్రం వినోద్ కుమార్ ,వార్డు సభ్యులు మూషం శ్రీనివాస్ ,కూరెళ్ళ మహేష్ ,తుమ్మలగూడెం మచ్చగిరి,కూరపాటి అరుణ, గ్రామ ప్రజలు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## టీ గౌరారం కాలనీలో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణ సంకల్పం

**అక్షరకలం దేవరకొండ**

నల్గొండ జిల్లా డిండి మండలం టీ గౌరారం కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి కాలనీ ప్రజలు, పెద్దలు శ్రీకారం చుట్టారు. శనివారం నిర్వహించిన గ్రామ సమావేశంలో ఆలయ నిర్మాణ వ్యయం, నిధుల సేకరణపై సుదీర్ఘంగా చర్చించారు.గ్రామంలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఆలయ నిర్మాణం కోసం రూ. 3,000 విరాళంగా ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.ఈ విరాళాలను ఏప్రిల్ 1 నుండి జూన్ 1వ తేదీ లోపు అందజేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పేర్ల కళ్యాణి లింగమయ్య మాట్లాడుతూ.. గ్రామ ప్రజలందరూ ఐకమత్యంతో ముందుకు వచ్చి ఆలయ నిర్మాణానికి సహకరించడం అభినందనీయమని, తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఉపసర్పంచ్ పిల్లి లక్ష్మమ్మ మాట్లాడుతూ భక్తులు, గ్రామ పెద్దలు భక్తిశ్రద్ధలతో ఈ పునర్నిర్మాణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పిల్లి బాలయ్య, వార్డు సభ్యులు ఆంజనేయులు, పిల్లి వెంకటయ్య, విలేఖరి పేర్ల మహేష్, గ్రామ పెద్దలు నల్లగాసు సత్తయ్య, వరికుప్పల వెంకటేశులు, బద్దె శంకర్, యువకులు ు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వేదికలు మారుతున్నాయి.. "రాతలు మారేనా".!

**ప్రజావాణి 'ప్రత్యేకం' సరే.. పరిష్కారం మాటేమిటి.?**

**దివ్యాంగుల గోడు వినేందుకేనా? తీర్చేందుకా ?**

**ప్రతి నెల చివరి శనివారం దివ్యాంగులు, వృద్ధుల 'ప్రజావాణి'**

**సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ వినూత్న చొరవ**

**ఈ ప్రత్యేక వేదికతోనైనా ఏళ్ల నాటి కష్టాలు తీరేనా.?**









సాధారణ ప్రజావాణి కార్యక్రమాల్లో రద్దీ వల్ల గంటల తరబడి వేచి ఉండలేక, తమ గోడును చెప్పుకోలేక ఇబ్బంది పడుతున్న దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల కోసం జిల్లా యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రతి నెల చివరి శనివారం వీరికి మాత్రమే కేటాయించిన 'ప్రత్యేక ప్రజావాణి' నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ప్రకటించారు. అందులో భాగంగానే శనివారం ప్రత్యేక ప్రజావాణి నిర్వహించారు.

### ప్రత్యేకత ఏంటి.?

సాధారణంగా సోమవారం జరిగే ప్రజావాణిలో జనం తాకిడి ఎక్కువగా ఉంటుంది. చక్రాల కుర్చీలు, కర్రల సాయంతో వచ్చే దివ్యాంగులకు, నిలబడలేని స్థితిలో ఉన్న వృద్ధులకు అది ఒక యుద్ధం లాంటిదే. దీనిని గమనించిన కలెక్టర్ చంద్రశేఖర్ వారికంటూ ఒక ప్రత్యేక సమయాన్ని కేటాయించారు. అన్ని శాఖల జిల్లా అధికారులు ఈ సమావేశానికి హాజరవుతారు. ఫిర్యాదు అందిన వెంటనే సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారు.



### పరిష్కారం లభించేనా.

ప్రభుత్వాలు ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా, క్షేత్రస్థాయిలో పెన్షన్లు రాకపోవడం, సదరం సర్టిఫికెట్ల జాప్యం, మూడు చక్రాల సైకిళ్లు, వినికిడి యంత్రాల పంపిణీలో ఆలస్యం







వంటి సమస్యలు వీరిని వేధిస్తున్నాయి. ఈ ప్రత్యేక ప్రజావాణి కేవలం వినతులు స్వీకరించే వేదికగా కాకుండా, కచ్చితమైన పరిష్కారం చూపే దిశగా సాగాలని బాధితులు కోరుకుంటున్నారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న మా సమస్యలకు ఈ ప్రత్యేక వేదిక ద్వారా మోక్షం లభిస్తుందని ఆశిస్తున్నాం. కలెక్టర్ రే నేరుగా మా బాధలు వినడం మాలో కొత్త నమ్మకాన్ని నింపుతోందని ప్రజావాణికి వచ్చిన బాధితులు పేర్కొంటున్నారు.కాగా ఈ శనివారం జరిగే మొదటి ప్రత్యేక ప్రజావాణికి సంబంధిత ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలని, ఈ అవకాశాన్ని అర్హులైన వారందరూ వినియోగించుకోవాలని జిల్లా యంత్రాంగం కోరింది. అయితే గతంలో జిల్లా కలెక్టర్ గా పని చేసిన ఇలా త్రిపాఠి కూడా గురువారం దివ్యాంగుల కోసం కొన్ని వారాలపాటు ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏది ఏమైనా దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ లు మాత్రం ఇప్పటికైనా తమ సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరుతున్నాను.

**కారింగు శ్రీనివాస్ గౌడ్**
**(అక్షరకలం ఫోటోగ్రాఫర్ నల్గొండ)**

# సారు వచ్చారు.. "సాత్విక భోజనం" రుచి చూశారు



**మోత్కూర్ సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతి తనిఖీ**

**విద్యార్థులతో కలిసి భోజనం**

**వంట గది నుంచి టాయిలెట్స్ వరకు స్వయంగా పరిశీలించిన జిల్లా బాస్**

**నాణ్యతలో రాజీ పడితే చర్యలు తప్పవని హెచ్చరిక**

**హిమేష్ అనే విద్యార్థితో కలెక్టర్ చిట్**

**చాట్.. ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయాలని దిశానిర్దేశం**

**అక్షరకలం యాదాద్రి భువనగిరి**

సంక్షేమ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, ప్రతిరోజూ మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని





జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి స్పష్టం చేశారు. శనివారం మోత్కూర్ మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా కలెక్టర్ పాఠశాలలోని ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల హాజరు, అందుబాటులో ఉన్న వసతులపై ఆరా తీశారు. స్వయంగా టాయిలెట్స్ వద్దకు వెళ్లి పరిశుభ్రతను పరిశీలించారు. పరిసరాలను ప్రతిరోజూ శుభ్రం చేయించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల అజాగ్రత్త వహించకూడదని అధికారులను ఆదేశించారు. కిచెన్ రూమ్, స్టోర్ రూమ్‌లను సందర్శించి వంట సరుకుల నాణ్యతను పరీక్షించారు. తాజా కూరగాయలు, నాణ్యమైన పప్పు ధాన్యాలు, నూనె మాత్రమే వాడాలని సూచించారు. హాస్టల్‌లో చదువుతున్న హిమేష్ అనే విద్యార్థితో కలెక్టర్ సరదాగా గడిపారు. ఏం చదువుతున్నావు? పెద్దయ్యాక ఏమవుతావు? అని అడిగి తెలుసుకున్నారు. కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థిని ప్రోత్సహించారు. కేవలం పరిశీలనకే పరిమితం కాకుండా, మధ్యాహ్నం వడ్డించిన భోజనాన్ని కలెక్టర్ స్వయంగా రుచి చూశారు. విద్యార్థుల మధ్యలో కూర్చుని వారితో కలిసి భోజనం చేస్తూ, భోజనం నాణ్యతపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని విద్యార్థులను అడిగి నిర్ధారించుకున్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# విడిపోయిన "మనసులు" ఒకటయ్యాయి

## లోక్ అదాలత్ సాక్షిగా కలిసిన జంట

తుంగతుర్తి కోర్టులో వీడిన మనస్పర్థలు

12 ఏళ్ల నాటి బంధానికి దొరికిన కొత్త ఊపిరి

దంపతులకు అభినందనలు తెలిపిన జడ్జి గౌస్ పాషా



అక్షరకలం తుంగతుర్తి

లోక్అదాలత్ సాక్షిగా ఓ జంట ఒక్కటైంది. క్షణికావేశంతో కోర్టు మెట్టెక్కిన దంపతులు లోక్అదాలత్ సాక్షిగా ఒక్కటయ్యారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలోని జూనియర్ సివిల్ కోర్టు ప్రాంగణంలో జడ్జి ఎండి.గౌస్ పాషా ఆధ్వర్యంలో జరిగిన లోక్అదాలత్ లో తుంగతుర్తి మండలం గొట్టిపర్తి గ్రామానికి చెందిన వీరమల్లు సరిత దంపతులు 2012లో వివాహం జరిగింది. మనస్పర్థలతో వేరువేరుగా ఉంటున్న, వాళ్ళిద్దరూ ఒక్కటి కావడంతో అందరు సంతోషం వ్యక్తం చేశారు.కేసులు వద్దు సామరస్యంగా పరిష్కారం ముద్దు, అది లోకదాలత్తే సాధ్యపడుతుందని, జడ్జి పేర్కొన్నారు. కక్షి దారులు శనికావేశాన్ని మరిచి, ప్రతి ఒక్కరు ప్రేమ అభిమానంతో జీవించాలని కోరారు. లోక్ అదాలత్ లో విశేషణ స్పందన రావడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీఐ నరసింహారావు, ఎస్సై క్రాంతి కుమార్ చిరంజీవి, సైదులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు అనపర్తి జ్ఞాన సుందర్, కారంగుల వెంకటేశ్వర్లు, పర్వీన్ బేగం, రాజు, వేణు యాదవ్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## వావిల్కోల్‌లో అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల దాడి: రెండు ట్రాక్టర్ల సీజ్



అక్షరకలం దేవరకొండ

మండల పరిధిలోని వావిల్కోల్ గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలపై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. శనివారం అందిన ముందస్తు సమాచారం మేరకు గ్రామంలో తనిఖీలు చేపట్టగా, మూడు ట్రాక్టర్లు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.పోలీసులను చూడగానే ఒక ట్రాక్టరు యజమాని (డ్రైవర్) వాహనాన్ని వదిలిపెట్టి అక్కడి నుండి పరారయ్యాడు. పట్టుబడిన రెండు ట్రాక్టర్లతో పాటు, పరారైన వ్యక్తికి చెందిన ట్రాక్టరుపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. "ప్రభుత్వ అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు. అక్రమ ఇసుక రవాణాపై నిఘా కొనసాగుతుంది, ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే వాహనాలను సీజ్ చేయడమే కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం."

## రైతుల పంటలు ఎండిపోకుండా చూడాలి

-- బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కాసాల



అక్షరకలం, చండూరు

చండూరు మండలంలో విద్యుత్ అంతరాయం మూలంగా ఏ ఒక్క రైతు పంట ఎండిపోకుండా చూడాలని బిజెపి కిసాన్ మోర్చా నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు కాసాల వెంకట్ రెడ్డి శనివారం చండూరు మండల విద్యుత్ అధికారి పల్లపు సాయి గణేష్ కు చరవాణి ద్వారా కోరారు. అనంతరం చండూరులో రైతులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మండలంలో పలు గ్రామాల్లో లో వోల్టేజ్ సమస్య ఉందని ఇట్టి లో వోల్టేజ్ సమస్యను అధిగమించాలని అవసరం ఉన్న చోట వ్యవసాయ కనెక్షన్ల వద్ద లోడ్ బ్యాలెన్సింగ్ పనులు చేపట్టి రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేలా అధికార, సిబ్బంది నిరంతరం కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. రైతులు కారింగు వెంకన్న, కన్నెగోని యాదయ్య, సురిగి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన సర్టిఫికెట్ కోర్సు

అక్షరకలం నల్గొండ



ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వ) నల్గొండ, రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9 నుండి మార్చి 4 వరకు జీవన నైపుణ్యాలు, సానుకూల మనస్తత్వశాస్త్రం అనే అంశంపై సర్టిఫికెట్ కోర్సును నిర్వహించటం జరిగింది. ఈ సందర్భంగా సర్టిఫికెట్ కోర్సును పూర్తి చేసుకున్న విద్యార్థినులను ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కే. శ్రీనివాస రాజు అభినందించి, విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించడానికి, జీవితంలో విజయం పొందడానికి జీవన నైపుణ్యాలు అనేవి చాలా అవసరం అని, లైఫ్ స్కిల్స్‌ను అలవరచుకుంటూ, పాజిటివ్ సైకాలజీని జీవనశైలిగా మార్చుకున్నప్పుడు ప్రతి రోజూ ఉల్లాసంగా, అర్థవంతంగా ఉంటుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోర్స్ కోఆర్డినేటర్ కొమ్ము నరేష్ మాట్లాడుతూ, మన నిత్య జీవితంలోని అవసరాలను, సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి అవసరమైన సామర్థ్యాలే 'జీవన నైపుణ్యాలు' అని, పాజిటివ్ సైకాలజీ మనలోని బలాలు, సంతోషం, నైతిక విలువల గురించి చర్చిస్తుంది అని తెలియజేశారు. కళాశాల గ్రంథాలయ శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ సుంకరి రాజారామ్ మాట్లాడుతూ,నేటి వేగవంతమైన ప్రపంచంలో కేవలం పుస్తక జ్ఞానం ఉంటే సరిపోదని, వ్యక్తిగత ఎదుగుదలకు, మానసిక ప్రశాంతతకు లైఫ్ స్కిల్స్ మరియు పాజిటివ్ సైకాలజీ మధ్య సమన్వయం ఎంతో అవసరం అని, లైఫ్ స్కిల్స్ మనకు 'పని చేసే నైపుణ్యాన్ని' ఇస్తే, పాజిటివ్ సైకాలజీ ఆ పనిని ఉత్సాహంగా చేసే మనస్తత్వాన్ని ఇస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ ఏ వసంత, పరీక్షల విభాగం అధిపతి డాక్టర్ వెంకటకృష్ణ, డాక్టర్ డి మల్లీశ్వరి, పుష్పలత, డాక్టర్ చైతన్య సుధ, డాక్టర్ దయానంద్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బుద్ధ వనం సందర్శించిన ప్రపంచ బౌద్ధ శాంతి సదస్సు ప్రతినిధులు...





అక్షర కలం నాగార్జునసాగర్ / నందికొండ

నాగార్జునసాగర్,మార్చి, 28: నాగార్జునసాగర్ లోని బుద్ధవనాన్ని శనివారం నాడు ప్రపంచ బౌద్ధ శాంతి సదస్సు ప్రతినిధులు సందర్శించారు. హైదరాబాదులో నిర్వహించిన ప్రపంచ బౌద్ధ శాంతి సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన శ్రీలంక బుద్ధ శాసన మత సాంస్కృతిక శాఖ మంత్రి హెనిడుమ సునీల్ సెనెవి విజయ విహార్ అతివృహానికి చేరుకోగా మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య, టూరిజం హోటల్స్ జనరల్ మేనేజర్ నాదన్, మిర్యాలగూడ డి. ఎస్. పి రాజశేఖర్ రాజు తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం 22 దేశాలకు చెందిన ప్రొఫెసర్లు, బౌద్ధ భిక్షువులు, బౌద్ధ నిపుణులు బుద్ధవనం చేరుకోగా ప్రపంచ బౌద్ధ శాంతి సదస్సు ప్రతినిధులకు టిబెట్ సంప్రదాయ పద్ధతిలో వాయిద్యాలతో స్వాగతం పలికారు. బుద్ధ వనములో బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలు ఘటించిన అనంతరం మహాస్తూపం లోని ధ్యాన మందిరంలో బుద్ధ జ్యోతులను వెలిగించిన అనంతరం పలు దేశాలకు చెందిన బౌద్ధ సంప్రదాయ పద్ధతిలో చాటింగ్ చేస్తూ ధ్యానం చేశారు. అనంతరం తెలంగాణ టూరిజం లాంచీలో నాగార్జునకొండ మ్యూజియం చేరుకోగా మ్యూజియం క్యూరేటర్ కమలహాసన్ ఈ బృందానికి ఘనంగా స్వాగతం పలికారు.నాగార్జున కొండపై పునర్ నిర్మించిన అశ్వమేధ యజ్ఞశాల, గౌతమ బుద్ధుని ధాతువులు లభ్యమైన మహాస్తూపము, శ్రీలంక దేశానికి సంబంధించిన సింహాల విహారము ను సందర్శించారు. నాగార్జునకొండ మ్యూజియంలో నాగార్జునకొండ మ్యూజియం లో బుద్ధ ధాతువులను దర్శనం చేసుకుని వందనం చేసుకున్నారు. వీరికి స్థానిక టూరిజం గైడ్ నాగార్జునసాగర్ ప్రాజెక్టు,నాగార్జున కొండ, బుద్ధవనం విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా శ్రీలంక మంత్రి హెనిడుమ సునీల్ సెనేవి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా నెలకొని ఉన్న యుద్ధ వాతావరణం లో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ బుద్ధవనం నిర్వహించిన సదస్సు ద్వారా ప్రపంచానికి శాంతి సందేశాన్ని ఇవ్వడం ఆ సదస్సులో తాను పాల్గొనడం నిజముగా తనకెంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. యుద్ధ సమయంలో ఇటువంటి శాంతి సదస్సులు నిర్వహించడం మంచి పరిణామం అన్నారు. భారతదేశానికి శ్రీలంకకు గతంలోనే మైత్రి సంబంధాలు ఉన్నాయని వాటిని భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ప్రముఖ బౌద్ధ గురువు వియత్నాం బౌద్ధ సంఘం ఉపాధ్యక్షులు తోచ్ నట్, గగనమాలిక్ ఆధ్వర్యంలో బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య చెరువతో ఇటువంటి శాంతి సదస్సు ద్వారా భవిష్యత్తులో ఎంతో మార్పు రాగలదని ఆకాంక్షించారు. వీరితోపాటు ఆంధ్రప్రదేశ్ టూరిజం మాజీ సీ ఎం డి,బుద్ధవనం గైడర్ చెన్నూరు ఆంజనేయ రెడ్డి, తెలంగాణ టూరిజం ఏజీఎం జంగయ్య, పెద్ద ఊర తాసిల్దార్ శ్రీదేవి, బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర, బుద్ధవనం ఆర్ట్స్ మరియు ప్రమోషన్స్ మేనేజర్ శ్యామసుందర్రావు తదితరులు ఉన్నారు. ప్రపంచ బౌద్ధ శాంతి సదస్సు ప్రతినిధుల సాగర్ సందర్శన సందర్భంగా సాగర్ సిఐ శ్రీను నాయక్, హాలియా సీఐ సతీష్ ల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాట్లను చేశారు.

## అంగన్వాడీ కేంద్రాలకు ప్రీ-స్కూల్ మెటీరియల్ పంపిణీ.




అక్షర కలం ; చిట్యాల

నల్గొండ జిల్లా చిట్యాల మండలం ఏపూరు గ్రామ అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల విద్యా ప్రమాణాలను పెంచేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అద్భుతమైన చొరవ తీసుకుంది. ఎస్బీఐ పాన్ ఇండియా సిఎస్ఆర్ యాక్టివిటీస్‌లో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఎస్బీఐ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాలకు అవసరమైన వివిధ రకాల వస్తువులను శనివారం పంపిణీ చేశారు. చిన్నారుల విజ్ఞానానికి, వినోదానికి మరియు మౌలిక వసతుల కల్పనకు ?డిజిటల్ విద్య కోసం ఎల్ఈడి టీవీ ?వంట మరియు తాగునీరు: రైస్ కుక్కర్, వాటర్ ఫిల్టర్. ?భోజన వసతి: స్టీల్ ప్లేట్లు, గ్లాసులు మరియు బౌల్స్. ప్రీ-స్కూల్ వర్క్ బుక్స్, నోట్స్, పెన్సిల్స్, ఆట వస్తువులు మరియు జారుడుబండ అందజేశారు.?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ చైర్మన్ లక్ష్మీ రెడ్డి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో చదువుకునే నిరుపేద పిల్లలకు ఈ మెటీరియల్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. చిన్నారుల విద్య, పోషణ మరియు వారి సమగ్ర అభివృద్ధికి ఇటువంటి సేవా కార్యక్రమాలు దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు. ?ఈ కార్యక్రమంలో పంతంగి ఎస్బీఐ బ్యాంక్ మేనేజర్ క్రాంతి కుమార్, గ్రామ సర్పంచ్ పాలెం మహేష్ గౌడ్, ఉప సర్పంచ్ సైదులు, వార్డు మెంబర్ సత్ర వెంకన్న, గ్రామ పెద్దలు, అంగన్వాడీ టీచర్లు డి. ధనలక్ష్మి, ఎండి. అంశమ్మ మరియు చిన్నారుల తల్లులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి సహకరించిన ఎస్బీఐ యాజమాన్యానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## శిరస్త్రాణం (హెల్మెట్) వాడకం ప్రతి ఒక్కరి భాధ్యత

అక్షర కలం సిద్దిపేట మార్చి 28:

సిద్దిపేట త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ టి. లక్ష్మీబాబు తెల్పిన వివరాల ప్రకారం ఈరోజు తేదీ: 28.03.2026 నాడు సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లో సిద్దిపేట ఎ.సి.పి యం. రవీందర్ రెడ్డి గారు హాజరు అయి సిద్దిపేట నందు గల మహీంద్రా ట్రాక్టర్ షోరూం, రాయల్ ఎన్ఫీల్డ్ షోరూం వారి సహకారంతో సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది అందరికీ హెల్మెట్ లను పంపిణీ చేసినారు. అరివ్ ఏలీవ్ రోడ్డు భద్రత వారోత్సవల కార్యక్రమంలో భాగంగా కమిషనర్ ఆఫ్ పోలీస్ సాధన రష్మి పెరమాళ్ ఐ.పి.ఎస్ ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి భద్రత దృష్ట్యా ప్రతి పోలీస్ సిబ్బంది భాద్యతగా హెల్మెట్ ధరించలని తెల్పినారు. పోలీస్ సిబ్బంది అందరూ ఆరోగ్యంగా ఉండాలని జిల్లా పోలీస్ సిబ్బందికి ఇటీవల స్పోర్ట్స్ మీట్ ఏర్పాటు చేసినారు. పోలీస్ సిబ్బంది ఎవరు అనారోగ్యనికి గురికాకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో ఆరోగ్య కాకి కార్యక్రమంతో అందరికీ రక్త నమూనాలను సేకరించి, డాక్టర్ లను సంప్రదించే కార్యక్రమాలను చేయనున్నారు. ఈ సందర్భంగా సిద్దిపేట ఎ.సి.పి యం. రవీందర్ రెడ్డి మాట్లాడుచు హెల్మెట్ ధారణ ప్రతి ఒక్కరికీ అత్యంత ముఖ్యమని, రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించడంలో హెల్మెట్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అలాగే పోలీస్




సిబ్బంది ముందుగా హెల్మెట్ వినియోగంలో ఆదర్శంగా ఉండాలని, ప్రజలకు అవగాహన కల్పించడంలో ముందుండాలని సూచించారు. రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెల్పి మహీంద్రా ట్రాక్టర్ షోరూం, రాయల్ ఎన్ఫీల్డ్ షోరూం వారు ఇచ్చిన హెల్మెట్ లను సిబ్బందికి అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇన్స్పెక్టర్ టాటా లక్ష్మీ బాబు, ఎస్.ఐ లు చంద్రయ్య, మల్లేశం, సిబ్బంది మరియు షోరూం ప్రతినిధులను అభినందించారు.



## రాజీ మార్గం ద్వారానే పెండింగ్ కేసుల పరిష్కారం

-- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ. జయరాజ్

యాదాద్రిభువనగిరి అక్షరకలం

రాజీ మార్గం ద్వారానే పెండింగ్ కేసులు పరిష్కారం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ జయరాజ్ అన్నారు. శనివారం భువనగిరి జిల్లా కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కుటుంబ వివాదాన్ని పరిష్కరించుకున్న భార్య, భర్తలను జిల్లా న్యాయమూర్తి అభినందించారు . ఈసందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ వివిధ కోర్టుల్లో పెండింగులో ఉన్న రాజీ పడదగిన కేసులను పరిష్కరించుకోవడం వల్ల కక్షిధారులకు సమయం డబ్బు ఆదాతో పాటు శాంతియుత సమాజ శ్రేయస్సుకు దోహద పడిన వారిగా ఉంటారని సూచించారు. చిన్న చిన్న కారణాలతో దారి తీసిన వివాదాలను పట్టింపు లేకుండా పరిష్కరించు కోవాలన్నారు. ఇరువురు రాజీతో స్నేహపూర్వకంగా మెలగాలని అన్నారు. మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి పి. ముక్తిదా, ఫోక్సో కోర్టు స్పెషల్ జడ్జి మిలింద్ కాంబ్లీ, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి స్వాతి, రెండవ తరగతి మెజిస్ట్రేట్ జ్యోతిరావు, లోక్ అదాలత్ సభ్యులు జి నాగేంద్రమ్మ, కె. మల్లేష్, సి. హెచ్. ఐలయ్య, కె. గోపాల్ రావు,న్యాయవాదులు, పోలీసు యంత్రాంగం పాల్గొన్నారు. రాజీ పడిన కక్షిదారులకు ఈ సందర్భంగా అవార్డు పత్రాలను అందజేశారు. ఈ జాతీయ లోక్ ఆదాలత్ లో జిల్లా వ్యాప్తంగా 7 సివిల్ కేసులు, 2163 క్రిమినల్ కేసులు, 23 పి ఎల్ సి కేసులు, మొత్తంగా 2193 కేసులను పరిష్కరించారు.



# తెలంగాణకు 9,540 ఎంబీబీఎస్ సీట్లు

**ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి ప్రశ్నకు లోక్‌సభలో వివరాలు వెల్లడించిన కేంద్రం**

**దేశవ్యాప్తంగా సీట్ల పెంపునకు చర్యలు తీసుకున్నట్లు వివరణ**

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**



తెలంగాణలో వైద్య విద్య సీట్ల వివరాలను కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో వెల్లడించింది. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు.తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం 9,540 ఎంబీబీఎస్ (ఖ+) సీట్లు, 3,997 పీజీ సీట్లు అందుబాటులో ఉన్నట్లు నేషనల్ మెడికల్ కమిషన్ (చీవీజ) సమాచారం ఆధారంగా తెలిపారు.

దేశవ్యాప్తంగా పరిస్థితి ఇలా...

దేశంలో మొత్తం 1,28,976 ఎంబీబీఎస్ సీట్లు, 85,839 పీజీ సీట్లు ఉన్నట్లు కేంద్రం వెల్లడించింది. వైద్య విద్యకు భారీ డిమాండ్ ఉండగా, సీట్ల పెంపుపై చర్యలు కొనసాగుతున్నాయని తెలిపింది.

చీజుజుకు లక్షల్లో పోటీ

2025లో చీజుజు (ఖ+)కు 22,76,069 మంది నమోదు, 22,09,318 మంది హాజరు కాగా, 2026లో 22,79,724 మంది నమోదు చేసుకున్నారని వెల్లడించారు. చీజుజు-ూా+ 2025కు దాదాపు 2.42 లక్షల మంది హాజరైనట్లు తెలిపారు.

సీట్ల పెంపునకు చర్యలు

దేశవ్యాప్తంగా కొత్త మెడికల్ కాలేజీల స్థాపనకు కేంద్రం అనుమతులు ఇచ్చింది. మొత్తం 157 కాలేజీలకు ఆమోదం లభించగా, అందులో 137 ఇప్పటికే పనిచేస్తున్నాయి. అదనంగా 83 కాలేజీలలో 4,977 ఎంబీబీఎస్, 4,058 పీజీ సీట్లు పెంపుకు ఆమోదం ఇచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రులు, పీజీ ఇన్‌స్టిట్యూట్లలో 5,000 పీజీ, 5,023 ఎంబీబీఎస్ సీట్లు సృష్టించే ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు.

# హౌస్ లిస్టింగ్ శిక్షణకు శ్రీకారం

**మండల స్థాయిలో సమగ్ర అవగాహన కల్పించాలి: డీపీఓ రవీందర్**




**మహబూబ్ నగర్. మార్చ్ 28. అక్షర కలం :**

జనగణన హౌస్ లిస్టింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కె. రవీందర్ సూచించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఎన్.ఐ.సి కాన్ఫరెన్స్ హాల్‌లో ఫీల్డ్ ట్రైనర్లకు నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మండల స్థాయిలో సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్లకు ఫీల్డ్ ట్రైనర్లు పకడ్బందీగా శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. జనగణనలో హౌస్ లిస్టింగ్, ఎన్యూమరేషన్ దశలు కీలకమని, టెక్నికల్ అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సమగ్రంగా, ఖచ్చితంగా సేకరించిన సమాచారం ఆధారంగానే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు అవుతాయని తెలిపారు. అందువల్ల ప్రతి దశను నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతగా నిర్వహించాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్లు బాలు యాదవ్, శ్రీకాంత్‌లు శిక్షణ అందించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నిరుపేదలకు అన్నదానం చేస్తున్న దివ్యాంగుడు ఆటో ముజాహిద్.

**అక్షర కలం / ఇల్లందు.**

ఇల్లందు స్టేషన్ బస్తీకి చెందిన నిరుపేద, ఆటో కార్మికుడు దివ్యాంగుడు సోషల్ వర్కర్ ముజాహిద్ "సాజన్ దివ్యాంగుల వృద్ధుల మానవ సేవ ట్రస్ట్ "ను ఏర్పాటు చేసి దాతలు అందించిన వండిన మిగిలిపోయిన, భోజనాన్ని నిరుపేదలకు తన ఆటో ద్వారా నిత్యం ఆకలితో పోరాటం చేస్తున్న అన్నార్తులను గుర్తించి వారి దగ్గరికి వెళ్లి భోజనాన్ని పంపిణీ చేస్తున్నారు. శనివారం కామరాజు ఎస్ అండ్ పిసి సింగరేణి వారి టీం సభ్యులు ముజాహిద్ నెల కోల్పిన సాజన్ మానవసేవ ట్రస్టును సంప్రదించి వండిన భోజనాన్ని అన్నార్తులకు పంపిణీ చేయమని కోరడంతో వారి దగ్గరికి వెళ్లి భోజనాన్ని తన ఆటోలో పెట్టుకొని నిరుపేదలు స్లమ్ ఏరియాలో ఉన్న నిరుపేదల దగ్గరికి వెళ్లి పిలిచి భోజనాన్ని పంపిణీ చేశారు. నిరుపేద అయిన ఆటో ముజాహిద్ తన ఆటో తోలకం ద్వారా వచ్చిన ఆదాయంతో తన కుటుంబాన్ని పోషించుకుంటూ మిగిలిన ఆదాయాన్ని జమ చేసుకొని తన సొంత ఖర్చులతో అర్హులైన వికలాంగులను కొత్తగూడెం కలెక్టర్ ఆఫీస్ తీసుకెళ్లి అధికారులతో కలెక్టర్ తో మాట్లాడి ట్రై సైకిళ్ల ను ఎంతోమందికి ఎన్నోసార్లు ఇప్పించారు. తన ఆటో ద్వారా గర్భిణీ స్త్రీలకు, వృద్ధులకు ఉచిత ప్రయాణాన్ని కల్పించి ఎంతో మందికి సహకరించారు. తను ప్రయాణం చేసే రహదారులలో గుంతలు ఉంటే వెంటనే మట్టిని తన ఆటోలో తీసుకొచ్చి గుంతలను పూడ్చేవాడు. ఎండాకాలంలో తన స్తోమతకు తగ్గట్లు చలివేంద్రా లను ఏర్పాటు చేసి తన ఆటో ద్వారా సింగరేణి మంచినీటిని తీసుకొచ్చి కుండలలో నింపి మూతలను గరిటలను గ్లాసులు ఏర్పాటు చేసి దాహార్తుల దాహన్ని తీరుస్తున్నాడు. శుభ అశుభ కార్యాలయాలలో తాజాగా వండిన అన్నం కూరలు మిగిలిపోతే ఆటో ముజాహిద్ కు ఫోన్ చేసి నిరుపేదల అన్నార్తులకు పంపిణీ చేయమని ఇటీవల ఫంక్షన్ బాధ్యులు 21, 24, నెంబర్ 2 బస్తి నుండి ఫోన్ రావడంతో వెళ్లి భోజనం కూరలను తీసుకువచ్చి అన్నార్తులకు పెట్టినట్లు ఆయన తెలిపారు. "మానవ సేవ యే మాధవ సేవ "అని తలంచి ఇటీవల స్టేషన్ బస్తీలో ఉన్న తన ఇంటి ఎదురుగా మూడు వేలకు, కరెంటుకు 1,000/- రూపాయలు,మొత్తం 4,000 వేలతో తో అద్దె ఇంటిని కిరాయి తీసుకొని మత మతిస్థిమితం లేని ముగ్గురిని కాలు చేయి పనిచేయని దివ్యంగుడు ఒకరిని ,మొత్తం నలుగురిని చేరదీసి ఈ నలుగురికి అందులో మహిళలకు తన భార్య, మగవారికి తను (ముజాహిద్ ) స్నానం చేపించి ఉదయం టి,టిఫిన్ మధ్యాహ్నం భోజనం సాయంత్రం టీ, రాత్రి భోజనం ఏర్పాటు చేసి అనార్తులకు అపన్న హస్తంగా తన దాతృత్వాన్ని చాటుతున్నాడు. కటిక నిరుపేద,



దివ్యాంగుడు, ఆటో కార్మికుడైన ముజాహిద్ కు ప్రభుత్వం గుర్తించి తనకు ఎలక్ట్రిక్ వాహనాన్ని, ప్రభుత్వం ఉచిత స్థలాన్ని ఇచ్చి భవనాన్ని నిర్మించి ఇవ్వాలని పట్టణ ప్రజలు మేధావులు వివిధ పార్టీల నేతలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. నిజమైన వికలాంగులకు,అనాధలకు సేవ చేస్తున్న దివ్యాంగుడు ఆటో ముజాహిద్ కు స్థితిమంతులు శ్రీమంతులు ప్రముఖ వ్యాపారస్తులు వస్తువుల రూపేనా ఆర్థికంగా సహకరించి తమ దానగుణాన్ని చాటుకోవాలని తద్వారా మానవసేవయే మాధవసేవ ద్వారా భగవంతుని కరుణ కటాక్షాలు పొందాలని కోరుకుందాం. దివ్యాంగుడు సోషల్ వర్కర్ నిరుపేద ఆటో ముజాహిద్ స్థాపించిన సాజన్ దివ్యాంగుల వృద్ధుల మానవ సేవ ట్రస్ట్ కు సెల్. నెంబర్ 9963832597, ఇల్లందు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణ రాష్ట్రం. నెంబర్ కు ఫోన్ చేసి నిజ నిజాలు తెలుసుకొని సహకరించి ఆదుకోవాలని కోరుకుందాం.

# దేశంపై యుద్ధ ప్రభావం - పెరుగుతున్న ధరలు -వ్యవసాయ రంగం పట్ల నిర్లక్ష్య ధోరణి -సమస్యల పరిష్కారానికి ప్రజా పోరాటాలు -సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో బాగం

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం : పశ్చిమాసియా యుద్ధ ప్రభావం భారతదేశంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. కార్పొరేట్, ఆయిల్ కంపెనీల కోసమే మోడీ ఆయిల్ ధరలు తగ్గించారని అది సామాన్యులకు ఉపయోగపడదన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం స్థానిక గిరిప్రసాద్ భవన్లో జాగర్లమూడి రంజిత్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హేమంతరావు మాట్లాడుతూ యుద్ధ నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందన్నారు. ట్రంప్ ముందు నోరు మెదపలేని స్థితిలో మోడీ ఉన్నారని ఆయన చెప్పింది చేయటమే ప్రధానిగా మోడీ పనిగా మారిందన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత దేశంలో అన్ని వస్తువుల ధరలు విపరీతంగా పెరగనున్నాయని బిజెపి గెలుపు కోసం ధరల పెరుగుదలను ప్రస్తుతానికి నిలువరించారన్నారు. మోడి, ట్రంప్ ల మధ్య కుదిరిన వ్యవసాయ రంగానికి సంబంధించిన ఒప్పందాలు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపనున్నాయని హేమంతరావు




తెలిపారు. విదేశీ దిగుమతులపై సుంకాన్ని రద్దు చేయటం, ఎగుమతులపై 2.5 నుండి 36 శాతానికి పెంచటం వలనా దేశీయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభ్యం కావటం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగం పట్ల తీవ్ర వివక్షను ప్రదర్శిస్తున్నాయని హేమంతరావు ఆరోపించారు. భరోసా విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి సరైంది కాదన్నారు. ఇప్పటికీ మూడు మాసాలు గడిచిందని ఇప్పుడు కూడా ఒక ఎకరానికి మాత్రమే భరోసా జమ చేయడం ద్వారా రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాలకులు ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్నారని, ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల సేవలో ఉంటే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయటంలో తీవ్ర జాప్యం చేస్తుందన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించాలని హేమంతరావు సూచించారు. పార్టీ నిర్మాణ కార్యక్రమాల్లో భాగంగా పార్టీ సభ్యత్వం, శాఖల నిర్మాణంపై దృష్టి సారించాలని సూచించారు. మొక్కజొన్న సహా వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధరల కోసం, విబి జి రామ్ జి పథకాన్ని ఉపసంహరణ, నాలుగు లేబర్ కోడ్ల రద్దు తదితర సమస్యలకు సంబంధించి సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని హేమంతరావు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సర్వాంగ సుందరంగా మారనున్న బాలుర జూనియర్ కళాశాల మైదానం

**ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధికి శ్రీకారం -**

**- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్ నగర్, మార్చి 28. అక్షర కలం :**



నగరంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానాన్ని అన్ని వర్గాల ప్రజలకు అనుకూలంగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మైదానాన్ని సందర్శించి వాకర్స్, క్రీడాకారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మైదానానికి నిత్యం వచ్చే ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. నగర ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతిరోజూ వందలాది మంది వాకర్స్, క్రీడాకారులు, మహిళలు ఈ మైదానాన్ని వినియోగిస్తున్నందున, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. మైదానంలో తాగునీరు, మరుగుదొడ్లు, కూర్చునే సదుపాయాలు, ఆధునిక వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాత్రి వేళల్లో కూడా ప్రజలు సురక్షితంగా వినియోగించుకునేలా హైమాస్ట్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మైదానాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదనంగా, మైదాన ప్రాంగణంలో ప్రజలకు ఉపయోగపడే విధంగా గ్రంథాలయం, యోగా సెంటర్ ఏర్పాటు చేసి సుందరీకరణ చేయనున్నట్లు తెలిపారు. నగర అభివృద్ధిలో భాగంగా అన్ని పార్కులను దశలవారీగా అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన ఆరోగ్య, వినోద వాతావరణం కల్పించనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. మైదాన అభివృద్ధి పనులకు సమగ్ర ప్రణాళిక రూపొందించి త్వరలోనే పనులు ప్రారంభించాలని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు సూచించారు. అనంతరం ప్రభుత్వ విప్‌గా ఎంపికైన సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, 57వ డివిజన్ కార్పొరేటర్ ఎంపి ప్రవీణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రామాంజనేయులు రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ భగవంతా చారి, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# పోలేపల్లి ఎస్ఈజెడ్‌లో రసాయన వ్యర్థాల కలకలం

**అధికారుల దాడులు... కఠిన చర్యలకు హెచ్చరికలు**

**మహబూబ్‌నగర్, మార్చ్ 28. అక్షర కలం :**



జడ్చర్ల మండలం పోలేపల్లి ఎస్ఈజెడ్ పరిధిలో మరోసారి కాలుష్య భయం కలకలం రేపింది. లెదర్ పార్క్‌కు కేటాయించిన భూమిలో కొందరు పరిశ్రమలు రసాయన వ్యర్థాలను నిర్లక్ష్యంగా పారబోస్తున్నారనే సమాచారంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. వెంటనే ఉన్నతాధికారులు రంగంలోకి దిగడంతో పరిస్థితి తీవ్రత వెలుగులోకి వచ్చింది. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ నేతృత్వంలో గురువారం ప్రత్యేక బృందం సంఘటన స్థలానికి చేరుకుంది. ఆర్‌డీఓ నవీన్, పరిశ్రమల కేంద్రం జి.ఎం. యాదయ్య, కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్, జడ్చర్ల తహసీల్దార్ తదితరులు తనిఖీల్లో పాల్గొన్నారు. రసాయన వ్యర్థాలు పారబోస్తున్న ప్రదేశాన్ని సమగ్రంగా పరిశీలించిన అధికారులు అక్కడి పరిస్థితులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థల పరిశీలనలో నేల కాలుష్యం, దుర్వాసన, చుట్టుపక్కల ప్రాంతాలపై ప్రభావం వంటి అంశాలు అధికారుల దృష్టికి వచ్చాయి. స్థానిక ప్రజల ఆరోగ్యంపై కూడా దీని ప్రభావం పడే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమల నిర్వాహకులతో ప్రత్యక్షంగా మాట్లాడిన అధికారులు, నిబంధనల ఉల్లంఘనపై తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. "పర్యావరణానికి హాని కలిగించే చర్యలను ఏమాత్రం ఉపేక్షించం. పరిశ్రమలు తప్పనిసరిగా కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటించాలి. వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించాలి" అని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్లక్ష్యం కొనసాగితే లైసెన్సుల రద్దు సహా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కూడా వ్యర్థాల నమూనాలను సేకరించి పరీక్షలకు పంపినట్లు తెలిపారు. నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అలాగే టీఎస్ఐఐసీ అధికారులు పరిశ్రమల పనితీరుపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. స్థానికులు కూడా కాలుష్యంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, వెంటనే కట్టడి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అధికారుల ఆకస్మిక తనిఖీలతో పోలేపల్లి ఎస్ఈజెడ్ పరిధిలోని పరిశ్రమల్లో కలవరం నెలకొంది. ఇకపై పర్యావరణ పరిరక్షణపై మరింత కఠిన చర్యలు తీసుకునే దిశగా అధికారులు చర్యలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది.

# ప్రతి రూపాయి పారదర్శక వినియోగమే లక్ష్యం

**-- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**2026--27 తొలి కార్పొరేషన్ బడ్జెట్ ప్రవేశపెట్టిన మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్**

**మహబూబ్‌నగర్, మార్చి 28. అక్షర కలం :**




మహబూబ్‌నగర్ నగర అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా పనిచేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో నిర్వహించిన సాధారణ సమావేశంలో 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంచనా బడ్జెట్‌ను నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. కార్పొరేషన్‌గా మారిన తర్వాత ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ కావడంతో దీన్ని సమర్థవంతంగా అమలు చేసి నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని పిలుపునిచ్చారు. గతంలో ఉన్న బడ్జెట్ లోటును దశలవారీగా భర్తీ చేయాలని, ఇందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నగర అభివృద్ధి ఒక్కరి వల్ల సాధ్యం కాదని, అందరి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఆదాయ వనరులను పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ముఖ్యంగా ఆస్తి పన్నుల వసూళ్లను 100 శాతానికి చేర్చాలని ఆదేశించారు. ప్రతి డివిజన్‌లో సమగ్ర అభివృద్ధి సాధించాలంటే పన్నుల వసూళ్లు కీలకమని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వసూలు చేసే ప్రతి రూపాయి ఖర్చు పారదర్శకంగా ఉండాలని, ఎటువంటి దుర్వినియోగం జరగకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. నిధులను సమర్థవంతంగా వినియోగిస్తేనే మహబూబ్‌నగర్‌ను రాష్ట్రంలో ఆదర్శ నగరంగా తీర్చిదిద్దవచ్చని అన్నారు. రాబోయే ఐదేళ్ల పాటు ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారి సమస్యలను పరిష్కరించి విశ్వాసం పొందాలని కార్పొరేటర్లకు సూచించారు. అనంతరం ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిని కార్పొరేటర్లు ఘనంగా సన్మానించారు. ఆయన నాయకత్వంలో నగరం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కారం చేసుకోవాలి - జిల్లా జడ్జి సాయి రమాదేవి




**అక్షర కలం సిద్దిపేట జిల్లా ప్రతినిధి మార్చి 28**

: లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని సిద్దిపేట జిల్లా జడ్జి సాయి రమాదేవి సూచించారు. శనివారం జిల్లా కోర్టు భవనంలో జిల్లా జడ్జి లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ తగాదాలు తదితర కేసులను కక్షిదారుల సమ్మతితో వన్ టైం సెటిల్మెంట్ ద్వారా పరిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ రాజీ మార్గం రాజ మార్గం అని, సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే బాధ లేకుండా లోక్ అదాలత్ ద్వారా వెంటనే పరిష్కరించుకునేందుకు అవకాశం ఉన్నదని తద్వారా కక్షిదారుల సమయం వృధా అవ్వడమే కాకుండా లబ్ది కూడా సత్వరమే జరగడంతో నిరీక్షించాల్సిన అవసరం లేదని అన్నారు. ఈ సంవత్సరం నిర్వహిస్తున్న ఈ మొదటి లోక్ అదాలత్ కార్యక్రమం కోసం జిల్లా కోర్టులో ఏడు బెంచ్ లను ఏర్పాటు చేయడం జరిగిందని, అలాగే హుస్నాబాద్, గజ్వేల్, చేర్యాల కోర్టులలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీస్ అధికారులు, కక్షిదారులు, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మార్చి 28:**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో సింగరేణి కార్మికులకు నెలకు మూడు మెడికల్ బోర్డులు నిర్వహించి, వంద శాతం మెడికల్ ఇన్వాలిడేషన్ చేస్తామని హామీ ఇచ్చి, కార్మికులను మోసం చేసిందని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) నాయకుడు ప్రతాప్ సారంగపాణి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమంలో భాగంగా శనివారం సింగరేణి మందమర్రి ఏరియాలోని కాసీపేట 2 గనిపై నిరసన కార్యక్రమం నిర్వహించి, గని మేనేజర్ లక్ష్మీనారాయణ వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్రతాప్ సారంగపాణి మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కార్మికుల హక్కులు హరించడమే కాకుండా, సింగరేణి నిర్వహణే కష్టతరమయ్యే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. సింగరేణిలో 40 వేల కోట్ల బకాయిలు పేరుకుపోయి, కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితిని తీసుకువచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ప్రభుత్వ మిత్ర సంఘాలకు బుద్ధి చెప్పేలా కార్మిక వర్గం ప్రశ్నించాలని, త్వరలోనే వారికి బుద్ధి చెప్పే రోజు ఆసన్నమైందని తెలిపారు. వెంటనే మెడికల్ బోర్డు నిర్వహించి, కార్మికులకు న్యాయం చేయాలని, అదేవిధంగా బకాయిలు చెల్లించి, సింగరేణిని కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకీ, యాదగిరి, ఆయిల్ రవి, రాజయ్య, తిరుపతి, మహేనమ, కేదారి అర్జున్ లు పాల్గొన్నారు.

## మైనింగ్ స్టాఫ్ పదోన్నతుల్లో ఆలస్యం ఎందుకు..?

**ఎస్సీఈయు (సిఐటియు) రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి అల్లి రాజేందర్**

**మందమర్రి, మార్చి 28 అక్షర కలం ప్రతినిధి:**



సింగరేణిలో కార్మికులకు అధికారులకు మధ్య వారధిగా పనిచేస్తున్న మైనింగ్ స్టాఫ్ సిబ్బందికి సమయానికి పదోన్నతులు ఇవ్వడంలో ఆలస్యం ఎందుకని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి అల్లి రాజేందర్ సింగరేణి యాజమాన్యాన్ని ప్రశ్నించారు. శనివారం ఆయన ఏరియాలోని కేకే 5 గనిని సందర్శించి, మైనింగ్ స్టాఫ్ సిబ్బందిని కలిసి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజేందర్ మాట్లాడుతూ, శిక్షణ పూర్తి చేసుకున్న జేఎంఈటి లకు సమయానికి రావాల్సిన సీనియర్ మైనింగ్ సర్దార్ పదోన్నతులు ఇవ్వడం లేదని, అదే విధంగా సీనియర్ మైనింగ్ సర్దార్ గా చేస్తున్న వారికి ఖాళీ లను సాకుగా చూపి, ఓవర్ మెన్ పదోన్నతులు ఇవ్వకుండా ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. దీంతో వారికి రావాల్సిన పదోన్నతి ఇంక్రిమెంట్ కోల్పోయి ఆర్థికంగా నష్టం కలుగుతుందని తెలిపారు. అదేవిధంగా పదోన్నతి రాకపోవడంతో బీటెక్ అర్హత కలవారు అండర్ మేనేజర్ పరీక్ష రాయడానికి సైతం అర్హత కోల్పోతున్నారన్నారు. కార్మికులకు, అధికారులకు మధ్య వారధిగా పనిచేస్తూ, సంస్థ ఉత్పత్తి సాధనకు తోడ్పాటు అందిస్తున్న మైనింగ్ స్టాఫ్ సూపర్వైజర్ సిబ్బందిని చిన్న చూపు చూడడం సరైనది కాదని తెలిపారు. వెంటనే వారికి రావాల్సిన పదోన్నతులు సమయానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఇంచార్జ్ బండారి తిరుపతి, నాయకులు వెంకట సాయి, శ్రీకాంత్, ప్రశాంత్, అఖిలేష్, వంశీ, ప్రశాంత్, పాల్గొన్నారు.

## జిల్లా ప్రధాన న్యాయ అధికారిని మర్యాదపూర్వకంగా కలిసిన పాలమూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

మహబూబ్ నగర్, మార్చి 28 (అక్షరకలం): ఇటీవల జరిగిన పాలమూరు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గం శనివారం జిల్లా ప్రధాన న్యాయ అధికారి ప్రేమలతను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయ అధికారి ప్రేమలత నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు సీనియర్ న్యాయవాది ఆనందరావు, ప్రధాన కార్యదర్శి డబ్బుల నరసింహ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వెంకటయ్య, సహాయ కార్యదర్శి సబిత, ట్రెజరర్ రాజ గౌడ్, లైబ్రరీ ఇన్‌చార్జి ప్రభావతి తదితర కార్యవర్గ సభ్యులు కృష్ణవంశీ, మహేష్ కుమార్, విష్ణు వేద, వంశీకృష్ణ మద్వరాజ్, శ్రీకర్ శర్మ, మురళీమోహన్, ఝాన్సీ, మమత, జ్యోతి లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రేమలత మాట్లాడుతూ, కార్యవర్గ సభ్యులు అందరూ ఐక్యంగా



పని చేసి పాలమూరు బార్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. న్యాయవృత్తిలో నైతిక విలువలను పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

# అందని నీరు... ఎండుతున్న పైరు

## తలాపునే గోదారి గలగలలు అయినా రైతులకు తిప్పలు

**అక్షర కలం సిద్దిపేట మార్చి 28:**

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం బద్దిపడగ గ్రామంలో రైతుల ఆవేదన రోజురోజుకూ పెరుగుతోంది. ఎండలు తీవ్రరూపం దాల్చడంతో పంటలకు అవసరమైన సాగునీరు





అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పంట చివరి దశలో నీరు అత్యవసరంగా ఉండగా, ప్రస్తుతం నీటి కొరత రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికే చెక్‌డ్యాంలు పూర్తిగా అడుగంటిపోయాయి. బావులు, బోర్లు కూడా నీటి మట్టం గణనీయంగా పడిపోవడంతో రైతులు వంతుల వారీగా నీటిని వినియోగించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పంటలకు సమయానికి తడులు అందించడం కష్టంగా మారింది. ఒక వైపు పచ్చగా మెరిసే వరిగొలుసుల పొలాలు కనిపిస్తుండగా, మరోవైపు నీరు అందక ఎండిపోయిన పైరు రైతుల దుస్థితిని స్పష్టంగా తెలియజేస్తోంది. బద్దిపడగ గ్రామానికి చెందిన రైతు తప్పేట పరుశరాములు తనకున్న ఎకరం రెండు గుంటల భూమిలో అద్దెకరం వరి సాగు చేస్తున్నారు. చేతికొచ్చిన పంట నీరు లేక ఎండిపోతుండటంతో ఆయన తీవ్రంగా కలత చెందుతున్నారు. ట్రాక్టర్ సహాయంతో వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని తెచ్చి పంటను కాపాడేందుకు శ్రమిస్తున్నా పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. చేతికొచ్చిన పంటను నిలబెట్టుకోవడానికి పడుతున్న కష్టం వర్ణనాతీతమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, గ్రామం సమీపంగా ప్రవహించే కాల్వ ద్వారా పంట పొలాలకు నీరు అందించాలనే ఉద్దేశంతో గతంలో భూ సేకరణ చేపట్టారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొందరు రైతులు స్వచ్ఛందంగా భూములు ఇవ్వగా, మరికొందరికి నష్టపరిహారం చెల్లించి భూసేకరణ పూర్తి చేశారు. అయితే అనంతరం కాల్వ నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ప్రస్తుతం యాసంగి పంటల సమయంలో బోరుబావులు ఎండిపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. చేతికొచ్చిన పంటను కాపాడుకోవడానికి ట్రాక్టర్ల ద్వారా నీటిని తరలిస్తూ అత్యవసర చర్యలు చేపడుతున్నారు. తలాపునే గోదావరి గలగలలాడుతున్నా రైతులకు మాత్రం నీటి కొరత తీరకపోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి కాల్వ నిర్మాణాలను పూర్తి చేసి సాగునీరు అందించాలని రైతులు వేడుకుంటున్నారు. లేకపోతే భారీ పంట నష్టం తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## మున్సిపల్ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య**

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మార్చి 28:**






మున్సిపల్ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య తెలిపారు. శనివారం జిల్లాలోని లక్షెట్టిపేట మున్సిపల్ కార్యాలయ సమావేశం మందిరంలో మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్, చైర్ పర్సన్ దొంత అంజలి, వైస్ చైర్ పర్సన్ రాజేశ్వరి లతో కలిసి బడ్జెట్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ పి చంద్రయ్య మాట్లాడుతూ, మున్సిపల్ అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం స్థానిక సంస్థల అభివృద్ధికి బడ్జెట్ ప్రణాళికలు సమర్థవంతంగా రూపొందించి అమలు చేయాలని తెలిపారు. వివిధ అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ, త్రాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించి, 2025-26 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్, 2026-27 సంవత్సరానికి గాను అంచనా బడ్జెట్ లను కౌన్సిల్ సభ్యుల ఆమోదంతో ప్రతిపాదిత మున్సిపల్ బడ్జెట్‌ను ఖరారు చేశారు. 2026-27 సంవత్సరానికి గాను అంచనా బడ్జెట్ 25 కోట్ల 80 లక్షల రూపాయల అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారని, ఇందులో 3 కోట్ల 42 లక్షల రూపాయలు సాధారణ ఆదాయం ( గ్రాంట్లు కాకుండా), 21 కోట్ల 42 లక్షల రూపాయల గ్రాంట్లు, 90 లక్షల రూపాయల డిపాజిట్లు, అడ్వాన్సులు, 5 లక్షల 95 వేల రూపాయల నిలువ ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మున్సిపల్ పరిధిలో పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. అనంతరం ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని డంప్ యార్డ్‌లో చేపడుతున్న బయో మైనింగ్ పనులను పరిశీలించారు. పాత చెత్తను శాస్త్రీయ పద్ధతులలో వేరు చేసి, పర్యావరణానికి హాని లేకుండా నిర్వహిస్తున్న విధానం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బయో మైనింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, పట్టణంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోండి.. ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ

**మందమర్రి, మార్చి 28 అక్షర కలం ప్రతినిధి:**







సింగరేణి యాజమాన్యం స్థానిక యువతకు లబ్ధి చేకూర్చేందుకు సామాజిక బాధ్యతతో నిర్వహిస్తున్న స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలను స్థానిక యువత సద్వినియోగం చేసుకోవాలని సింగరేణి ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ తెలిపారు. పట్టణంలోని స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ కేంద్రంలో ఏరియా సింగరేణి సిఎస్ఆర్, హైదరాబాద్ రీజినల్ డైరెక్టరేట్ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఎంటర్ప్రెనర్షిప్ (ఆర్డిఎస్డిఈ), ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన, సింగరేణి ఏరియా సేవా సమితి అధ్యక్షురాలు శ్రీవాణి రాధాకృష్ణ, సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, సిఎంఓఏఐ ఏరియా అధ్యక్షుడు రమేష్ లతో కలిసి ముఖ్య అతిథిగా హాజరై, కాస్మోటాలజీ కోర్సును పూర్తి చేసిన 31 మంది అభ్యర్థులకు ధృవీకరణ అందజేశారు. ఈ సందర్భంగా జిఎం రాధాకృష్ణ మాట్లాడుతూ, స్థానిక నిరుద్యోగ యువత విజయవంతంగా కాస్మోటాలజి కోర్సును పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ల సూచనల మేరకు సింగరేణి సిఎండి బుద్ధ ప్రకాష్ జ్యోతి స్థానికంగా ఉండే నిరుద్యోగ యువతకు లబ్ధి చేకూర్చే దిశగా సింగరేణి సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ లో భాగంగా సామాజిక బాధ్యతగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పట్టణ, పరిసర ప్రాంతాల్లోని నిరుద్యోగ యువత ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని, స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవాలని కోరారు. సింగరేణి సేవా అధ్యక్షురాలు శ్రీవాణి రాధాకృష్ణ మాట్లాడుతూ, కాస్మోటాలజి కోర్సును ఉపయోగించుకొని, ప్రతి ఒక్కరు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేసి, ఆర్థికంగా ఎదగడానికి మార్గన్వేషణ చేయాలని సూచించారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ సింగరేణి సంస్థ సిఎస్ఆర్ నిధులతో అందిస్తున్న వృత్తి విద్య కోర్సులు నేర్చుకొని, ఆర్థికంగా ఎదగాలని, తమతో పాటు తమతోటి వారి ఎదుగుదలకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిఎంవిటిసి అడిషనల్ మేనేజర్ టి శ్రీధర్, అసిస్టెంట్ ట్రైనింగ్ మేనేజర్ అశోక్ కుమార్, కాస్మోటాలజి ట్రైనర్ ప్రీతి, ఎంవీటిసి ఇన్స్ట్రక్టర్ డి శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

## టిబిజికేఎస్ ఆధ్వర్యంలో నిరసన

**మందమర్రి, మార్చి 28 అక్షర కలం ప్రతినిధి:**

అసెంబ్లీలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలకు నిరసనగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టిబిజికేఎస్) ఆధ్వర్యంలో శనివారం ఏరియాలోని అన్ని గనులు, విభాగాలలో నిరసన వ్యక్తం చేసి, అనంతరం సింగరేణి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఏరియాలోని కేకే 5 గని పై నిర్వహించిన నిరసన కార్యక్రమంలో యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు జే రవీందర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఓ రాజశేఖర్ లు హాజరై, నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జూలై, నవంబర్ నెలలో నిర్వహించిన మెడికల్ బోర్డులో అర్హత కలిగి అన్‌ఫిట్ చేయని కార్మికులకు తిరిగి మెడికల్ బోర్డు నిర్వహించాలన్నారు. సింగరేణిలో విజిలెన్స్, మారు పేర్ల సమస్యను పరిష్కరించాలని కోరారు. సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో



గెలిచిన ఏఐటియుసి, ఐఎన్టీయూసీ లు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. సింగరేణి యాజమాన్యం, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కార్మిక వ్యతిరేక చర్యలకు నిరసనగా యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించే పోరాటంలో కార్మికులు పాల్గొని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గని పిట్ కార్యదర్శి వీరారెడ్డి, ఏరియా నాయకులు శివ నాయక్, బొడ్డు మల్లేష్, పోలు సంపత్, సాయికృష్ణ లు పాల్గొన్నారు.

## సురక్షిత ప్రయాణాలను ప్రోత్సాహించాలనే లక్ష్యం: వన్ టౌన్ ఇన్స్పెక్టర్

**అక్షర కలం/ ఖమ్మం నగరం:**



రోడ్డు ప్రమాదాలను తగ్గించి వాహనదారుల సురక్షిత ప్రయాణాలను ప్రోత్సాహించాలనే లక్ష్యంతో పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'అరైవ్--అలైవ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఖమ్మం టౌన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు. నగరంలోని రైల్వే స్టేషన్ లకారం ట్యాంక్ బండ్ ప్రాంతంలో అరైవ్--అలైవ్ రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వన్ టౌన్ పోలీసుల సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ... ప్రతి వ్యక్తి సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవడమే అరైవ్--అలైవ్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు.

# గ్రామ అభివృద్ధి లక్ష్యం పనిచేయాలి ;

- వెంకటాపూర్ గ్రామంలో నూతన గ్రామపంచాయతీ కార్యాలయం ప్రారంభోత్సవం....
- గ్రామపంచాయతీ కార్యాలయానికి 20 లక్షలు మంజూరు....
- వాటర్ ప్లాంట్ ప్రారంభం....
- ఉమ్మడి మహబూబ్నగర్ ఎంపీ డీకే అరుణమ్మ.....





(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, మార్చ్,28)

గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేయాలని మహబూబ్నగర్ ఎంపీ డీకే. అరుణమ్మ అన్నారు. శనివారం నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో నూతన గ్రామపంచాయతీ కార్యాలయం భవనాన్ని ఆమె ప్రారంభించారు. అదేవిధంగా సూర్యచంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ను కూడా ఆమె ప్రారంభించారు. వెంకటాపురం గ్రామ సర్పంచ్ డి .విజయకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహబూబ్నగర్ ఎంపీడీకే అరుణమ్మ మాట్లాడుతూ గ్రామం అభివృద్ధి లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేయాలన్నారు. అందుకు సిసి రోడ్లు ,డ్రైనేజీలు మంజూరు చేసేందుకు తమ వంతు కృషి చేస్తానని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డోకూరు విజయ్ కుమార్ రెడ్డి, ఉప సర్పంచ్ నరహరి, వార్డు సభ్యులు, నాయకులు సూర్యచంద్ర ఫౌండేషన్ అధినేత సూర్య మోహన్ రెడ్డి, మండల అధ్యక్షులు బెలగొంది వీరన్న, గొల్ల కృష్ణయ్య, మరికల్ పట్టణ అధ్యక్షులు హరీష్, రాఘవేందర్, వెంకటాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ కళావతమ్మ, నాయకులు యుగంధర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, మనోహర్, రాజేష్ ,రతంగ్ పాన్ రెడ్డి ,మాధవరెడ్డి, అంజలి రెడ్డి, నందకుమార్ రెడ్డి ,పల్లవి, తిరుపతిరెడ్డి ,రఘుపతి రెడ్డి ,రాజు బాబు ,లక్ష్మారెడ్డి ,ప్రశాంత్ అధికారులు ఎం పీ ఓ పావని పంచాయతీ కార్యదర్శి గాయత్రి ,ల్యాబ్ నరసింహ, కురుమన్న, మల్లేష్, మరికల్ మండల వివిధ గ్రామాల సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

# మరికల్ సంత బజారు వేలంపాట ;

- రూ, 8 లక్షల 24,500....
- మరికల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్ రెడ్డి.....
- రెండవసారి దక్కించుకున్న కొండేటి తిరుమలయ్య ;



(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, మార్చ్,28)



నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలో గల సంత బజార్ వేలంపాట కార్యక్రమాన్ని మరికల్ గ్రామ సర్పంచ్ జి. చెన్నయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్ రెడ్డి ల ఆధ్వర్యంలో వేలంపాట కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఈ సంవత్సరం సంత బజార్ రూ,8 లక్షల23 వేల 66 రూపాయలకు ప్రభుత్వం కేటాయించడం జరిగిందని తెలియజేశారు. ఈ వేలం పాట లో మరికల్ గ్రామానికి చెందిన తిరుమలయ్య,మొగలప్ప, అంజయ్య, పెంట మీది రాఘవేందర్ ,పాల్గొన్నారు. ఈ వేలంపాట కార్యక్రమంలో గ్రామానికి చెందిన కొండేటి తిరుమలయ్య మరికల్ సంత బజారును రూ, 8, లక్షల 24,500 , తో రెండోసారి దక్కించుకోవడం జరిగింది. రెండవసారి దక్కించుకోవడం వల్ల ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఖాజా, వార్డు సభ్యులు అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ దుకాణాలను ఖాళీ చేయాలి ;

- మరికల్ గ్రామ సర్పంచ్, కార్యదర్శి, వార్డు సభ్యులు...

(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, మార్చ్,28)



నారాయణపేట జిల్లాలోని మరికల్ గ్రామ పంచాయతీకి సంబంధించిన దుకాణాల వ్యాపారులు టెండర్ ప్రకారం వచ్చే నెల ఒకటి తేదీ వరకు దుకాణాలను ఖాళీ చేయాలని మరికల్ గ్రామ సర్పంచ్ చెన్నయ్య, గ్రామ కార్యదర్శి శ్యాంసుందర్ రెడ్డి,వార్డు సభ్యులు, శనివారం నాడు యజమానులకు చెప్పడం జరిగింది. గ్రామ పంచాయతీకి సంబంధించిన దుకాణాలను వచ్చేనెల ఒకటవ తేదీ వరకు ఖాళీ చేయాలన్నారు. ఖాళీ చేయని పక్షాన గ్రామపంచాయతీ సిబ్బందితో కలిచేస్తామని వారు సూచించారు. కాబట్టి గ్రామపంచాయతీ దుకాణాల్లో ఉన్నటువంటి వారు వెంటనే ఖాళీ చేసి సహకరించాలని ఆయన కోరారు.

# జిల్లా కోర్ట్ ఆవరణలో ఘనంగా జాతీయ లోక్ అదాలత

## వేలాది కేసులకు వేగవంత పరిష్కారానికి మార్గం

మహబూబ్‌నగర్, మార్చి 28. అక్షర కలం :







జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి. సామ్ కోషి, న్యాయమూర్తి ఎన్.వి. శ్రావణ్ కుమార్ సంయుక్తంగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి పి. సామ్ కోషి మాట్లాడుతూ, 'లోక్ అదాలత్' అనేది ప్రజల న్యాయస్థానం అని, ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకునే ఉత్తమ వేదిక అని పేర్కొన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, మోటార్ ప్రమాద క్లెయిమ్‌లు, బ్యాంకు రుణాలు, చెక్కు బౌన్స్, కుటుంబ వివాదాలు వంటి కేసులను వేగంగా పరిష్కరించుకునే అవకాశం లోక్ అదాలత్ ద్వారా లభిస్తుందని తెలిపారు. లోక్ అదాలత్ తీర్పులు చట్టబద్ధమైనవని, అవి సివిల్ కోర్టు డిక్రీకి సమానమని, ఒకసారి పరిష్కారం కుదిరితే అప్పీల్‌కు అవకాశం ఉండదని వివరించారు. అందువల్ల పక్షాలు ముందుగానే చర్చించి సమ్మతి వ్యక్తం చేయడం అవసరమని సూచించారు. గతంలో సంవత్సరానికి ఒకటి లేదా రెండు సార్లు నిర్వహించేవారని, ప్రస్తుతం మూడు నెలలకు ఒకసారి దేశవ్యాప్తంగా ఒకేసారి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది లోక్ అదాలత్ ద్వారా 2200 కేసులు పరిష్కారం అయినట్లు వెల్లడించారు.

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఎన్.వి. శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, తక్కువ ఖర్చుతో వేగవంతమైన న్యాయం అందించడమే లోక్ అదాలత్ ప్రధాన ఉద్దేశ్యమని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నచిన్న వివాదాలు, కుటుంబ కలహాలు, రుణ సమస్యలను కోర్టు వెలుపలే సర్దుబాటు చేయడం ద్వారా సామాజిక సామరస్యాన్ని పెంపొందించవచ్చుని పేర్కొన్నారు. బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సహాయం అందించడంలో న్యాయ సేవాధికార సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎన్. ప్రేమలత మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 2033 కేసులను లోక్ అదాలత్ పరిష్కారానికి గుర్తించామని తెలిపారు. మహబూబ్‌నగర్‌లో 7 బెంచీలు, జడ్చర్లలో 2 బెంచీలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి సి.హెచ్. పంచాక్షరి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనంత రెడ్డి, న్యాయవాదులు, న్యాయాధికారులు, కోర్టు సిబ్బంది, పోలీసులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

### న్యాయమూర్తులకు ఘన స్వాగతం

లోక్ అదాలత్ కార్యక్రమానికి విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తులు పి. సామ్ కోషి, ఎన్.వి. శ్రావణ్ కుమార్‌లకు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎన్. ప్రేమలతలు ఆర్‌డబి అతిథి గృహం వద్ద పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.

# లక్ష్య చేధన కు నిరంతర సాధన చేయాలి..జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.



(అక్షర కలం, నారాయణపేట జిల్లా, రిపోర్టర్, మార్చ్,28)

విద్యార్థులు జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, ఆ లక్ష్య చేధన కు నిరంతర సాధన చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శనివారం ఆయన మద్దూరు మండలంలోని పెదిరి పాడ్ గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆ పాఠశాలలోని వంట గది, మరుగు దొడ్లు, స్టాక్ రూమ్, ఆర్వో ప్లాంట్ ను పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని ఎనిమిదో తరగతి గదిలోకి వెళ్ళి విద్యార్థినిలతో ముచ్చటించారు. పాఠశాలలో భోజనం, ఇతర వసతి సౌకర్యాలు, చదువు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అన్ని బాగున్నాయని విద్యార్థినిలు కలెక్టర్ కు తెలిపారు. ప్రతీ వారం సినిమా చూస్తున్నారా అని ఆరా తీశారు. ఇకపై ప్రతీ శనివారం విద్యార్థినులకు పాఠశాలలో మంచి సందేశాత్మక సినిమాలను చూపించాలని ఎస్. వో కు ఆయన సూచించారు. తరగతి గదిలోని విద్యార్థినుల జీవితాశయం, లక్ష్యం గురించి ఒక్కరిని అడగడంతో కొందరు ఐ ఏ ఎస్, ఐ పీ ఎస్, మరికొందరు డాక్టర్ అవుతామని తెలపగా ఆర్కిటెక్, సైంటిస్ట్ లు ఎవరూ కారా అని ప్రశ్నించారు. కొత్త కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్ళాలని సూచించారు. వారి వారి పుస్తకాల్లో విద్యార్థినుల పేర్లు రాయించారు. తరవాత పేర్ల ముందు వారు ఏం కావాలని అనుకుంటున్నారో ఆ డీజిగ్ నేషన్ ను రాయించి, రోజూ పుస్తకం తెరిచి చూస్తే తాము భవిష్యత్తులో ఆ డీజిగ్ నేషన్ చేరుకునేందుకు కష్టపడి చదవాలని తెలిపారు. కేవలం కలెక్టర్, డాక్టర్, ఇంజినీర్ అవుతాం అనుకుంటే సరిపోదని, ఆ స్థాయిని చేరుకునేందుకు ప్రణాళిక ప్రకారం చదువు కోవాలన్నారు. అనంతరం అక్కడున్న వైద్యులతో మాట్లాడి పాఠశాలలో విద్యార్థినిలు ఏ ఏ రుగ్మతలతో బాధపడుతున్నారని, వారిలో ఏ ఏ ఆరోగ్య సమస్యలు గుర్తించారని అడిగి తెలుసుకున్నారు. ఎనీమియా సమస్యతో ఉన్న విద్యార్థినిలు ఎక్కువగా ఉన్నారని, అందుకు తగిన మందులను ఇస్తున్నామని,ఆహారాన్ని పెట్టిస్తున్నామని వైద్యులు కలెక్టర్ కు తెలిపారు. మొత్తానికి పాఠశాలలో అన్ని బాగున్నాయని, పాఠశాలలో మరుగు దొడ్లు శుభ్రంగా ఉన్నాయని, ఆవరణ, వంటగది, తరగతి గదులు పరిశుభ్రంగా ఉన్నాయని కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

# మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ హైమావతి చేతుల మీదుగా పిల్లల దత్తత కార్యక్రమం.



అక్షర కలం సిద్దిపేట జిల్లా ప్రతినిధి మార్చి 28 : జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం రోజున 4 సంవత్సరాల బాబును ఆంధ్రప్రదేశ్ రాష్టంలోని విజయనగరం జిల్లాకు చెందిన దంపతులకు మరియు 6 నెలల ఆడ శిశువును తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాకు చెందిన దంపతులకు సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి చేతుల మీదుగా అధికారికంగా దత్తతను ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కలెక్టర్ దత్తత తీసుకున్న తల్లిదండ్రులతో మాట్లాడుతూ పిల్లలను బాగా చదివించాలని వారికీ ఇష్టమైన రంగంలో ప్రోత్సహం ఇవ్వాలని పిల్లల బంగారు భవిష్యత్తుకు బాట వేసే పూర్తి బాధ్యత మీదే అన్నారు. మరియు జిల్లాలోని పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకోవాలనుకుంటే సిద్దిపేటలో గల శిశు గృహ జిల్లా బాలల పరిరక్షణ విభాగం ద్వారా అధికారికంగా దరఖాస్తు చేసుకోవాలని తద్వారా ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు ఉండవని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ మమత, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాము మరియు శిశు గృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి రాజీవ్ పార్క్‌లో స్విమ్మింగ్ పూల్ ను ప్రారంభించిన టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

## పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనితా సంతోష్, అదనపు కలెక్టర్ మాధురి

సంగారెడ్డి ప్రతినిధి, అక్షరకలం..

సంగారెడ్డి పట్టణంలోని రాజీవ్ పార్క్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను శనివారం టీజేఐసీ చైర్మన్ నిర్మలా జగ్గా రెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్ మాధురి, సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజేఐసీ చైర్పర్సన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ... రాజీవ్ పార్క్ పక్కన ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. క్రీడాభివృద్ధిలో భాగంగా సుమారు రూ. 20 లక్షల వ్యయంతో ఈ పూల్‌ను పునరుద్ధరించినట్లు తెలిపారు. యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడానికి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవడానికి ఇటువంటి సదుపాయాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.పిల్లల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో స్విమ్మింగ్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈత ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కూడా కలిగిస్తుందని



పేర్కొన్నారు. స్పోర్ట్ అథారిటీ అధికారి అఖిలేష్ రెడ్డి మాట్లాడుతూ స్విమ్మింగ్ పూల్‌ను పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంచుతూ నెలవారీ, మూడు నెలల, ఆరు నెలల కార్డుల రూపంలో రేట్లు నిర్ణయించినట్లు తెలిపారు. ప్రతి వయస్సు వారికి అనుకూలంగా సమయాలను కూడా కేటాయించినట్లు వెల్లడించారు. వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో సంగారెడ్డి ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ముఖ్యంగా పిల్లలు, యువత పాల్గొనాలని అఖిలేష్ రెడ్డి కోరారు. స్విమ్మింగ్ ద్వారా ఆరోగ్యం మెర ుగుపడటంతో పాటు క్రీడా నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, క్రీడా విభాగం సిబ్బంది, కౌన్సిలర్ లు శ్రీకాంత్ , రమేష్, ప్రజాప్రతినిధులు , క్రీడాభిమానులు పాల్గొన్నారు.



# ట్రాఫిక్ నిబంధనలను పాటించి ప్రమాదాలను నివారిద్దాం

## ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం

**సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..**

తారా ప్రభుత్వ కళాశాల,సంగారెడ్డి ఎన్.ఎస్.ఎస్. విభాగాలు రెండు,మూడు,నాలుగుల ఆధ్వర్యంలో దత్తత గ్రామాలైన కల్పగుర్, అంగడిపేట్ మరియు మల్కాపూర్ గ్రామాలలో ప్రత్యేక శీతాకాల శిబిరాలలో భాగంగా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ తెలిపినారు.కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ సహకారముతో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు దత్తత గ్రామాలలో ప్రజలకు వివిధ అంశాలపై ర్యాలీల ద్వారా అవగాహనను కల్పిస్తున్నారని తెలిపినారు .అదే విధంగా కళాశాల వాలంటీర్లకు ట్రాఫిక్ నిబంధనలపై, సైబర్ క్రైమ్ మరియు ఫోక్ సో చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపినారు.ఈ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ట్రాఫిక్ ఎస్ఐలు సాయిలు, రాములు మరియు గోప్యాచవాన్ మాట్లాడుతూ ట్రాఫిక్ సిగ్నల్స్ ని పాటించాలని, ట్రిపుల్ రైడ్ చేయడం నేరమని, వాహనాన్ని నడుపుతున్నప్పుడు ఓవర్టేక్ చేయరాదని, వాహనదారులు హెల్మెట్ ను లైసెన్సును, నంబర్ ప్లేట్ ను, ఇన్సూరెన్సు, పొల్యూషన్ చెకప్ సర్టిఫికెట్ను తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపినారు. లైసెన్స్ లేకుండా మరియు




తాగి వాహనాలను నడపరాదని, అట్టి వారిపై చట్టపరంగా చర్యలు ఉంటాయని తెలిపినారు అదేవిధంగా తెలియని వ్యక్తుల నుండి వచ్చిన మెసేజ్లను ఓపెన్ చేయరాదని, తెలియని వ్యక్తులు ఓటీపీ అడిగినప్పుడు చెప్పరాదని, మన సెల్ ఫోన్లు జాగ్రత్తగా ఉపయోగించాలని, ఎట్టి పరిస్థితులలోనూ అపరిచిన వ్యక్తులకు సమాధానాలు ఇవ్వరాదని, అపరిచిత వ్యక్తుల చేతుల్లో సెల్ఫోన్లు పెట్టరాదని తెలిపినారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే అట్టి వ్యక్తులు 24 గంటల లోపు 1930 కు కాల్ చేస్తే వారు పోగొట్టుకున్న డబ్బును పోలీస్ డిపార్ట్మెంటు రికవరీ చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపినారు. అదేవిధంగా 18 సంవత్సరాల లోపు బాలికలను ఏ విధంగా వేధించరాదని, వారి తల్లిదండ్రులకు సమాచారం లేకుండా వారిని మనము ఎక్కడికి తీసుకొని పోరాదని, అది ఫోక్ షో చట్టం కిందికి, వస్తుందని లైంగికంగా వేధించిన, బాలికలను ఏ రకంగా ఇబ్బంది పెట్టిన ఫోక్సు చట్టం ప్రకారము నాన్బెయిలబుల్ వారంటూ ఉంటుందని, కఠినమైన జైలు శిక్ష ఉంటుందని, బాలికల విషయములో యువత జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. అదే విధంగా వాహనదారుల ట్రాఫిక్ సిగ్నల్స్ ను పాటించనప్పుడు ఏ విధంగా ట్యాప్ ద్వారా వారికి ఫైన్ వేయబడుతుందో, అదే విధంగా త్రాగి వాహనాన్ని నడిపితే నూతన పరికరం ఏ విధంగా పనిచేస్తుందో ప్రయోగపూర్వకంగా విద్యార్థులకు వివరించడం జరిగింది. అదేవిధంగా యువత జాగ్రత్తగా ఉండాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ రోడ్డు ప్రమాదాలు, సైబర్ క్రైమ్ వంటి వాటిపై ప్రజలలో అవగాహన కల్పించవలసిన బాధ్యత యువతరానిదే అని తెలిపి నారు. ఎన్ఎస్ఎస్ మూడవ విభాగం ఆధ్వర్యంలో మల్కాపూర్ లో జరుగుతున్న ప్రత్యేక శీతాకాల శిబిరంలో బాలికలు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాబోధనతోపాటు వారికి వివిధ రకాలైన ఆటలను ఆడించడం జరిగిందని, గ్రామములో ర్యాలీని నిర్వహించి ప్రజలలో సాంఘిక, ఆర్థిక అంశాలపై ,వివిధ రకాలైన అంటువ్యాధులపై అవగాహన కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ సదయ కుమార్, డాక్టర్ వాణి, డాక్టర్ జగదీశ్వర్, ట్రాఫిక్ పోలీస్ అధికారులు సాయిలు ,రాములు, గోప్య చౌహాన్, ట్రాఫిక్ ఏఎస్ఐ ప్రకాష్ రావు, కానిస్టేబుల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మార్చి 28:**

తెలంగాణ తొలి, మలి దశల ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించి, 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వెంకటయ్య మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చి, వారిని ఆదుకోవాలని, వారిని తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించి, ప్రతినెల 50 వేల రూపాయలు పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ అసెంబ్లీ శాసనసభ సమావేశాలు ముగియక ముందే ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కొరకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని ఇవ్వాలని, ఉచితంగా కార్పొరేట్ వైద్య సౌకర్యాలు అందించడానికి హెల్త్ కార్డులు జారీ చేయాలని, ఉద్యమకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. తొలి మలిదశ ఉద్యమంలో అమరులైన అమరవీరుల కుటుంబాలను, ఉద్యమంలో అలనాటి సీమాంధ్ర ప్రభుత్వ హయాంలో కేసుల పాలై, జైలుకు వెళ్లి, ఆర్థికంగా, శారీరకంగా నష్టపోయిన ఉద్యమకారులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమకారుల నాయకత్వంలో మరో పోరాటం తప్పదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు మురహరి, కార్యదర్శి గంగన్న, నాయకులు కస్తూరి సూర్యం, ఆర్ మోహన్ లాల్, రమేష్, ఎన్ అంజయ్య, పులి కృష్ణ, ఎం రాయమల్లు, రామన్న లు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామి కళ్యాణం



**సదాశివపేట ప్రతినిధి,అక్షరకలం..**

సదాశివపేట మండలం నందికంది గ్రామంలో వెలసిన శ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. పదవ శతాబ్దం కళ్యాణి చాళుక్యుల కాలంనాటి అతి పురాతనమైన శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం వార్షికోత్సవం పురస్కరించుకొని సర్పంచ్ రాచర్ల ప్రవంతి విజయభాస్కర్ రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు కృష్ణారెడ్డి,టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కళ్యాణ మహోత్సవానికి సదాశివపేట చుట్టుపక్కల గ్రామాల నుండి వేలాదిగా భక్తులు హాజరై స్వామివారి కళ్యాణం కనులారా వీక్షించి తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాదం స్వీకరించారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో సిడిసి చైర్మన్ గడీల రామ్ రెడ్డి, జిల్లా సర్పంచ్ల సంఘం ఉపాధ్యక్షులు గడిల ఆశి రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు చాట్ల సిద్దన్న, మాజీ సర్పంచ్ రాచర్ల అమరేందర్ రెడ్డి,గ్రామ ఉపసర్పంచ్ శివరాం,కాంగ్రెస్ నాయకులు చింటూ గౌడ్, ఆలయ వైస్ ప్రెసిడెంట్ మన్నే వరప్రసాద్, ఆలయకమిటీ సభ్యులు గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# షెడ్యూల్డ్ కులాల యువత నుండి దరఖాస్తుల స్వీకరణకు గడువు పొడిగింపు

### జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం ఈఈ చాతరాజుల దుర్గాప్రసాద్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మార్చి 28:**



2025-26 సంవత్సరానికి గాను షెడ్యూల్డ్ కలముల కార్యకరణ ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ ఆమోదిత మొదటి విడత పథకాల కోసం అర్హత గల ఎస్సి యువత దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఏప్రిల్ 2వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం ఈఈ చాతరాజుల దుర్గాప్రసాద్ ప్రకటనలో తెలిపారు. రవాణా రంగం ఎలక్ట్రికల్ లో ఈవి ద్విచక్ర వాహన లక్ష్యం 185 యూనిట్లకు గాను, 608 దరఖాస్తులు, ఈవి త్రిచక్ర వాహనం (సరకు, ప్రయాణికుల రవాణా) లక్ష్యం 91 యూనిట్లకు గాను, 838 దరఖాస్తులు, వ్యవసాయ పథకాలలో సోలార్ యూనివర్సల్ పంపు కంట్రోల్, వ్యవసాయ అనుబంధ భాగం లక్ష్యం 19 యూనిట్లకు గాను, 73 దరఖాస్తులు ఆన్ లైన్ లో నమోదు కావడం జరిగిందని తెలిపారు. ఆసక్తి, అర్హత గల షెడ్యూల్డ్ కులములకు చెందిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# కన్మనూర్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం,



**(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, మార్చ్,28)**

నారాయణపేట జిల్లా, మరికల్ మండలం కన్మనూర్ గ్రామంలో ఎంపీ డీకే అరణమ్మ, (విబి-జి ఆర్ఏఎం) "వికసిత్ భారత్ -- గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్)" నిధుల నుంచి 5 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు శుభారంభమయ్యాయి. గ్రామ సర్పంచ్ అంకిత సురేందర్ గౌడ్, ఉప సర్పంచ్ రవి కుమార్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి, రాజేష్ యాదవ్, మరియు పార్టీ కార్యకర్తలు, వార్డు సభ్యులతో కలిసి పూజ చేసి ఈ పనులను ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణంతో గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి మరింత వేగం పుంజుకుంటుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో కన్మనూరు గ్రామ ప్రజలు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు,

# శాసనమండలిలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

**మందమర్రి, మార్చి 28 అక్షర కలం ప్రతినిధి:**

శాసనమండలి సమావేశంలో సింగరేణిలో జరిగిన మెడికల్ ఇన్వాలిడేషన్ నియామకాలపై రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేసిన ప్రకటనను సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) తీవ్రంగా ఖండిస్తుందని యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు భీమనాథుని సుదర్శన్, జాయింట్ కార్యదర్శి కంది శ్రీనివాస్ లు తెలిపారు. శనివారం పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఉపముఖ్యమంత్రి చేసిన ప్రకటన బొగ్గు గని కార్మికుల త్యాగాలను, వారి హక్కులను కించపరిచేలా ఉందన్నారు. మెడికల్ ఇన్వాలిడేషన్ అనేది కార్మికులకు దక్కిన దయ కాదని, అది వారి హక్కు అని స్పష్టం చేశారు. భూగర్భ గనులలో దశాబ్దాల తరబడి ప్రాణాలకు తెగించి పనిచేయడం వల్ల అనారోగ్యం పాలైన కార్మికుడి కుటుంబం రోడ్డున పడకుండా ఇచ్చే భరోసా అని తెలిపారు. దీనిని ఆర్థిక భారంగా చూడడం అంటే కార్మికుల సేవను అవమానించడమే అని తెలిపారు. మెడికల్ బోర్డ్ లో నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో అన్ని నిబంధనలు పాటించిన తర్వాతనే ఇన్వాలిడేషన్ ప్రక్రియ జరిగేలా చూడాలని,




అక్రమాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే కానీ ఆ సాకు తో మెడికల్ బోర్డు ఆపడం చాలా దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు లేకపోవడం వల్ల కారుణ్య నియామకాలు కార్మికుల చిరకాల పోరాట ఫలితమన్నారు. వేలాది మంది యువతకు ఈ రూపంలో ఉపాధి లభించడం వల్ల కార్మిక కుటుంబాలు స్థిర పడ్డాయే తప్ప సంస్థకు నష్టం వాటిల్లలేదని తెలిపారు. విచారణ పేరుతో కార్మికులను భయభ్రాంతులకు గురి చేయాలని చూస్తే ఏఐటీయూసీ ఊరుకోదని స్పష్టం చేశారు. గతంలో 2000 - 2014 మధ్య జరిగిన నియామకాల సంఖ్యలు చూపి, 2014 తర్వాత జరిగిన నియామకాలు తప్పు అవడం రాజకీయ కోణమే తప్ప ఇందులో కార్మిక క్షేమం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కార్మిక వ్యతిరేక ప్రకటనలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంస్థను లాభాల బాటలో నడిపిస్తున్న కార్మికుల పట్ల సానుకూల వైఖరిని ప్రదర్శించాలని సూచించారు. లేని పక్షంలో సింగరేణి వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం ఏఐటియుసి యూనియన్ చేసిన సేవ్ సింగరేణి జాతను విమర్శించిన ఐఎన్టియుసి నేతలు, స్వయానా వారి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో సింగరేణి మెడికల్ ఇన్వాలిడేషన్ మీద కార్మికులకు ఇబ్బంది కలిగేలా చేసిన వ్యాఖ్యలపై వారి స్పందన తెలపాలని సవాల్ చేశారు. ఇప్పటికైనా మెడికల్ బోర్డు ఎందుకు జరగడం లేదో కార్మికులు గ్రహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ నాయకులు టేకుమట్ల తిరుపతి, పెద్దపల్లి బానయ్య, ఈ రాజేశ్వరరావు, సివి రమణ, పిట్ కార్యదర్శులు గాండ్ల సంపత్, మర్రి కుమారస్వామి, కల్వల శ్రీనివాస్, పారిపెల్లి సంజీవ్ కుమార్, యూనియన్ కోశాధికారి జీ సుదర్శన్ రెడ్డి లు పాల్గొన్నారు.

# భక్తి భావాన్ని పెంపొందించేందుకే సాంస్కృతిక ప్రదర్శనలు

## తెలంగాణ సాంస్కృతిక యువజన శాఖ సలహా మండలి సభ్యులు అంతడుపుల నాగరాజు

## అలరించిన శ్రీ సీతారాముల కళోత్సవాలు

**మందమర్రి, మార్చి 28 అక్షర కలం ప్రతినిధి:**

ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించేందుకే సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు తెలంగాణ సాంస్కృతిక శాఖ సలహా మండలి సభ్యులు అంతడుపుల నాగరాజు తెలిపారు. శుక్రవారం శ్రీరామనవమిని పురస్కరించుకొని క్రేజీ స్టార్స్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పట్టణంలోని యాపల్ ప్రాంతంలో గల శ్రీ కోదండ రామాలయంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కలోత్సవాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా శ్రీ కోదండ రామాలయం ఆలయ కమిటీ చైర్మన్ సంగార్తి సంతోష్ నటరాజ విగ్రహానికి పూలమాల వేశారు. మంచిర్యాల జిల్లా నృత్య కళా సమస్య సమాఖ్య జిల్లా అధ్యక్షుడు రాకం సంతోష్ కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని




ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి క్రేజీ స్టార్స్ డాన్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి నరేష్ సారథ్యం వహించారు. ఈ సందర్భంగా అంతడుపుల నాగరాజు మాట్లాడుతూ, కోల్ బెల్టులో కళలకు కొదవలేదని ఈ ప్రాంత ప్రజలు కళలను ఎప్పుడు ఆదరిస్తారని తెలిపారు. అనంతరం మొదలైన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ప్రముఖ గాయకుడు జంగిలి బాలకృష్ణ వినాయక శ్లోకంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమీక్ష ఆర్ట్స్ అకాడమీ పాలస బృందం ప్రదర్శించిన సీతా రామ కళ్యాణం, హారిక బృందం ప్రదర్శించిన రామ మీరా నృత్య రూపకం, అభిజ్ఞ బృందం ప్రదర్శించిన భావములు భాసముల నృత్య రూపకం అలరించాయి. యూట్యూబ్ నృత్య కళాకారిణి అంజలి జానపద నృత్యం అందరిని ఆకట్టుకున్నాయి. జానీ బాయ్ ఆర్కెస్ట్రా బృందం కళాకారులు జంగిలి బాలకృష్ణ, ప్రసన్న, సాధనవేణి ప్రభాకర్ కవిత, సింగర్ పోలు సంపత్ లు పాడిన పాటలు ప్రేక్షకులను కట్టి పడేశాయి. అధ్యశ్రీ, సుదీక్ష, ఎస్ కె తాన్య, శ్రీ చరిత, హాసిని చేసిన నృత్యాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో యూట్యూబ్ స్టార్ ఉప్పులేటి రాజమౌళి, కాంగ్రెస్ యువ నాయకుడు రాయబారపు కిరణ్, ప్రముఖ రచయిత విత్తనాల శ్రీనివాస్, బైరం రాము, శ్రీకోదండ రామాలయం ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు బొద్దిరెడ్డి రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బొద్దున ఓం ప్రకాష్, కోశాధికారి అడ్డూరి సాంబమూర్తి, వర్ష సంపత్, రాసపాక అశోక్, కొమ్ముశెట్టి తిరుపతి, పైడిపల్లి కుమార్, ఓదెలు, నూనె రవి, డాక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955